# సమర్థ సద్గురు

ఆధ్యాత్మిక మాసపత్రిక

వెల : రూ. 10.00

డిసెంబర్ 2025



## సెప్టెంబరు 22 నుండి అక్టోబరు 4 వరకు శ్రీ కాళీవనాశ్రమునందు జరిగిన శ్రీ దేవీనవరాత్రి ఉత్సవముల దృశ్యములు









# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

డా|| యమ్. స్వర్ణముఖి
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ
సన్నిధానం కాళీమాత

సంపుటి 45 సంచిక 4
పేజీలు 44
డిసెంబర్ 2025

5సం||ల చందా రూ. 500
2సం||ల చందా రూ. 240
సంవత్సర చందా రూ. 120
విడిప్రతి వెల...... రూ. 10

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed & Published by
Paluri Siva Rama Kali Prasad
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Nagendra Enterprises,
D.No.24-7-8, Sandeep Mansion
Jonnavittula Vari St.
Gandhi Nagar, Vijayawada
N.T.R. Dist., Andhra Pradesh.
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో ................................ ....... పేజీ**

శ్రీ కాళీ ప్రసాద శతకము .................... ..........4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట........................................ .................. 6
సంచలద్వాల సన్నద్ధలంబమాన శిఖోజ్జ్వల.........8
ముచికుందా నది........ ................................11
మాతాజీ బోధ .................................. ...........13
భగవద్గీత సాధన దీపిక ..............................15
హరికథా పితామహుడు
ఆదిభట్ల నారాయణ దాసు ..................17
శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద్
బాబూజీ మహరాజ్‌వారి
సహస్ర నామావళిః ....... 20
శ్యామ సుందరా! ఒక్కసారి, ఒక్కసారంటే
ఒక్కసారి తిరిగి కనిపించవూ! 22
నారద భక్తి సూత్రములు ............... ..............24
శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు....27
ధనమా-దైవమా......... ....................................28
శ్రీ బాబూజీతో నా ప్రయాణం .................30
నిరీక్షణ ..................................................................32
శ్రీ గురుగీత ......................................... ........35
శ్రీబాబూజీతో అనుభవాలు ................. 37
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ...... ........................... ...................41

## శ్రీ కాళీ ప్రసాద శతకము - పాలూరి ప్రసాద్

7. *తేనెలోని గింజ కడు తియ్యనౌను*
*మరి యావకాయలోన పుల్లనౌను*
*ఆత్మలోనె మనసు నూరబెట్టనౌను*
*కాళీ ప్రసాదు మాట కాంతిబాట ॥*



తా: శనగ గింజను తేనెలోగాని, పంచదార పాకంలోగాని ఊరబెడితే అది తియ్యగా మారిపోతుంది. అదే మరో గింజను ఆవకాయలో ఊరబెడితే అది పుల్లగా మారుతుంది. అలాగే నీ మనస్సును ప్రపంచంలో ఊరబెడితే ప్రపంచ గుణాలనే పొందుతుంది. అందుకే మనస్సును ఆత్మలో ఊరబెట్టాలి. అప్పుడు అది ఆత్మలో లీనమై శాశ్వతమైన ఆత్మానందాన్ని అనుభవిస్తుంది.

1) తేలు కుట్టిన బాధ ఎలా మాయమైపోయింది?
2) రెండు చేతులతో చేసే వందనానికి అర్థం ఏమిటి?
3) మూడు రకముల కర్మలు ఏవి?
4) శ్రీకృష్ణుడు ఎందుకు అర్జునుని ముందుగా రథం దిగమన్నాడు?
5) ఒకేమారు ఐదు తాళాలకు అనుగుణంగా పాడగల ప్రతిభాశాలి ఎవరు?
6) త్రికరణ సామ్యము లేని సాధన వలన కలిగే నష్టం ఏమిటి?
7) మూసీనదికి, భాగవతానికి సంబంధం ఏమిటి?
8) కారుకు స్టెఫనీ టైరులాగా ఉండటం అంటే ఏమిటి?
9) ఆత్మవస్తువుకి కావలసిన ఆహారం ఏది?

*సమాధానాలు లోపలి పేజీలలో............................*

## శ్రీ బాబూజీ ఉవాచ - కీ.శే. పరాశర ప్రసాద్

8-10-1981

ఈరోజు విజయదశమి. రాత్రి గురుకులం బాలబాలికలచే నాటిక ప్రదర్శించబడే సమయం అది. శ్రీబాబూజీ రాక కోసం భక్తులందరూ రామాలయంలో ఎదురు చూస్తున్నారు. మేము విజ్ఞానమందిరం హాలులో కూర్చుని వున్నాము. శ్రీ బాబూజీ మెట్లమీదనుండి క్రిందికి దిగగానే స్వామితో కలిసి వెళ్దాము అనుకుంటున్నాము.



ఇంతలో రామాలయంలో మైకు లోంచి గురుకులం బాలబాలికలు ప్రార్థన చేయటం వినవచ్చింది. శ్రీ బాబూజీ ఇంకా రాలేదు కదా! వచ్చిన తర్వాత వెళ్దాం అని అనుకుంటున్నాము.

ఇంతలో గుండుకొలను కాళీ హాలులోకి వచ్చి 'అదేమిటి, శ్రీ బాబూజీ రామాలయంలో ఉంటే మీరు ఇక్కడ ఉన్నారు?' అనేసరికి, మేము నిశ్చేష్టులమయ్యాము. శ్రీ బాబూజీ విజ్ఞానమందిరం మెట్లుదిగి హాలులోంచి కాకుండా పెరటివైపు గుమ్మంలోంచి వెళ్ళినట్లుగా తెలిసింది. అయినా మేము ఎలా ఆయనని మిస్సయ్యామా అనేది అర్థం కాలేదు. మేమంతా కలిసి రామాలయంలోకి వెళ్ళేసరికి మమ్మల్ని చూసి, 'మీరు ఎక్కడ ఉన్నారయ్యా ఇంతవరకు?' అని నవ్వారు.

### శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమవాసులు అయిన దాసరి సుబ్బారావుగారు 17-11-25 సోమవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 72 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

## అమ్మ మాట

- జపమాలా ప్రసాద

# ఆత్మ వస్తువుకు ఆహారం సత్సంగం


"సాగరానికి అలలు ఎంత సహజమో ఈ జీవితానికి కూడా రాకడ, పోకడ అనే అలలు అంత సహజము. ఈ రాకడ, పోకడ లేని నిత్యానంద స్థితిని గురించి విచారణ చేసుకునేందుకే 'సత్సంగం' అనేది అవసరం. పరిణామముతో కూడుకున్న శరీరానికి బలాన్నిచ్చేది మనం తినే అహారమైతే, యీ దేహాన్ని ప్రకాశింపజేస్తున్న నిత్యము, సత్యము, పరిణామ రహితము అయిన ఆత్మవస్తువుకి కావలసిన ఆహారం 'సత్సంగం'.



ఆత్మానందమనేది ఏదో చాక్లెట్టు లాగానో, ఉసిరికాయలాగానో చూపించేది కాదు. మన ఒంటిమీద జ్వరాన్నిగాని, తలనొప్పినిగాని ఎలాగ అనుభవిస్తామో, ఆత్మానందం కూడా అనుభవైకవేద్యం. "ఎన్ని పూజలు చేస్తున్నా, ప్రార్థనలకి వెళుతున్నా, ఆ ఆనందమేదో నాకు కనిపించడం లేదే" అని సవాల్ చేసిన ఒక చిన్న యువకుడికి సద్గురు మూర్తి శ్రీ బాబూజీ మహరాజ్‌వారు అనుభవపూర్వకంగా యిచ్చిన సమాధానము మీకు చెపుతాను. గురుమూర్తి, ఆ పిల్లవాడిని దగ్గరకు పిలిచి, మెడ క్రిందనున్న ఎముకను గట్టిగా నొక్కిపట్టేసరికి ఆ పిల్లవాడు 'నన్ను వదలండి, నన్ను వదలండి' అని గిలగిలలాడసాగాడు. అప్పుడు సద్గురుదేవులు, "ఏదిరా! నువ్వు నొప్పి అని బాధపడుతున్న ఆ నొప్పేదో నాకు చూపించరా! నీ నొప్పి నాకేమీ కనబడటం లేదే?" అనేసరికి ఆ పిల్లవాడు సిగ్గుతో తలవంచాడు.

కనుక, ఆత్మానందాన్ని పొందాలంటే సద్గురుమూర్తినాశ్రయించి, వారియందు అచంచలమైన విశ్వాసము కలిగివుండి, వారి ఆజ్ఞను తు.చ. తప్పకుండా ఆచరించాలి. గురుమూర్తి ప్రసాదించిన లక్ష్యార్థమును అత్యంత భక్తి శ్రద్ధలతో సాధన చేయాలి. కాలాన్ని మరచి ధ్యానం చేయాలి. అప్పుడా లక్ష్యార్థ స్వరూపంలో మనసు లయించినపుడు ఆ హాయిని మనం పొందగలము. ఇలాగన్నామని, 'మా పనులు బాధ్యతలు వదిలి

వేయాలా?' అని ప్రశ్నిస్తారేమో! శాశ్వతమైన, నిత్యమైన ఆ సచ్చిదానందాన్ని అనుభవించినటువంటి రామకృష్ణ పరమహంస, వివేకానంద, శ్రీబాబూజీ మహరాజ్ వంటి మహాత్ములెవరూ ఆ విధంగా చేయలేదు.



వారు తిరిగి, ఈ ప్రపంచంలోనికి వచ్చి, యీ ప్రపంచాన్ని ప్రకాశింప చేస్తున్న పరమాత్ముని చూడండి అని బోధించారు. ఈ ప్రపంచంలో అణువణువులోనూ పరమాత్మ తత్వమే తొణికిసలాడుతోంది. పరమ పురుషుడైన ఆ పరమాత్మ నిరంతరం యీ ప్రకృతితో రమిస్తున్నాడు. అదే 'రాసలీల'. అంతేగాని రాసలీల అంటే ఇంద్రియరతి కాదు. అందరిలోనూ మంచినే చూస్తూ, అందరికీ మంచినే చేస్తూ, మంచినే ఆలోచిస్తూ వుంటే, మన స్వరూపమే మంచిగా మారిపోతుంది. అటువంటి శక్తిని సద్గురుదేవులు మనకి ప్రసాదించుగాక! అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను, అఖండైశ్వర్య, భోగభాగ్యములను ప్రసాదించి, గురుపాదుకలు సర్వులనూ సర్వదా కాపాడుగాక!"

**మానవునిలోనే భగవంతుడు వున్నాడు. ఆ విషయం తెలుసుకో లేకపోతున్నాడు మానవుడు. అతని చుట్టూ అజ్ఞానపు పొరలు ఆవృతమై వుండటమే ఇందుకు కారణం. ఈ అజ్ఞాన పొరలు విడనప్పుడు గుడికి వెళ్ళినా, చర్చికి వెళ్ళినా, మసీదుకు వెళ్ళినా ఫలితం శూన్యం. దైవదర్శనం దుర్లభం! అజ్ఞాన తిమిరాన్ని పారద్రోలినప్పుడే మనో మందిరానున్న మూర్తిని దర్శించవచ్చు. ఆ చీకట్లని చీల్చడానికి కరదీపికను అందించే కరుణా సింధువే సద్గురువు!**

\- శ్రీ కాళీబాబు

# సంచలద్వాల సన్నద్ధ లంబమాన శిఖోజ్వల

- పాలూరి కాళీప్రసాద్

శ్రీ ఆంజనేయ అష్టోత్తర శతనామాలలో ఒక నామం – **ఓం సంచలద్వాల సన్నద్ధ లంబమాన శిఖోజ్వలాయై నమః**. సంచలత్ – బాగా కదులుతూ ఉన్న, వాల – తోకతో, సన్నద్ధ – సిద్ధంగా ఉన్న, లంబమాన – (ఆ తోకను) ఆశ్రయించి ఉన్న, ఉజ్వల – ప్రకాశిస్తున్న, శిఖ – అగ్నిశిఖను కలిగినవాడు అని అర్థం. తోక చివరన మండుతూ ఉన్న అగ్నితో లంకను కాల్చడానికి సిద్ధంగా ఉన్న ఆంజనేయుని రూపాన్ని ఈ నామం గుర్తుకు తెస్తుంది.



అయితే ఇది మనకు కూడా అన్వయిస్తుంది. ఆంజనేయుని తోకలాగే మన మనస్సు కూడా ఎప్పుడూ చలిస్తూ ఉంటుంది. వానరాలు ఈ కొమ్మ మీదనుంచి ఆ కొమ్మకు, ఆ కొమ్మ మీదనుంచి ఈ కొమ్మ మీదకు నిరంతరం దూకుతూ ఉన్నట్లు మన మనస్సు కూడా ఒక విషయం నుంచి ఇంకొక విషయం మీదకు అలాగే దూకుతూ వుంటుంది. అలాగే మనం ఏ చిన్న విషయాన్ని నేర్చుకున్నా, లేదా క్రొత్తగా ఒక పని చేసినా ఆంజనేయుని తోక చివరన ఎగసిపడుతున్న మంటలాగే మన ప్రతిభను పదిమందికీ చూపించాలని, అది చూసి అందరూ మనను మెచ్చుకోవాలని మన మనస్సు ఎగసిపడుతూ ఉంటుంది.

అయితే ఆంజనేయుని గమనిస్తే ఆయన ఎంతటి ప్రతిభావంతుడయినా, నవ వ్యాకరణ పండితుడైనా, అష్ట సిద్ధులు కలిగి ఉన్నా, ఎప్పుడూ శ్రీరామచంద్రుని పాదాల చెంత దాసుడై ఒదిగి ఉంటాడు. ఆ ప్రభువు ఆజ్ఞ లేనిదే ఏ పనీ చెయ్యడు. చూసి రమ్మంటే కాల్చి వచ్చాడని ఆయన మీద లోకం అపవాదు వేస్తుంది కానీ కాల్చడం కూడా ఆయన స్వామి ఆజ్ఞగానే స్వీకరించాడు. ముందు సీతాదేవి ఎక్కడ ఉందో చూసి రమ్మనే పంపించినా ఒకసారి అమ్మను చూసిన వెంటనే తరువాతి కర్తవ్యం ఏమిటో ఆయనకు త్రిజట స్వప్నం ద్వారా బోధ పడింది. ఒక వానరుడు లంకకు వచ్చి, అశోకవనాన్ని ధ్వంసం చేసి, వేలాది రాక్షసులను సంహరించి, లంకను కాల్చి తిరిగి వెళ్ళడం అనేది ముందుగానే భగవంతుడైన తన ప్రభువు నిర్ణయించి ఉంచాడని ఆ స్వప్న వృత్తాంతాన్ని వినడం ద్వారా ఆయనకు అర్థం అయ్యింది.

అందుకనే అప్పటి దాకా ఒక చిన్న పిల్లి పరిమాణంలో సూక్ష్మరూపంలో ఆకుల మధ్యలో ఒదిగి ఉన్న ఆయన వికటరూపాన్ని ధరించి లంకను కాల్చాడు. నిజానికి

గమనిస్తే ఆయన ఆ స్వప్నంలో చెప్పినంతవరకు మాత్రమే చేశాడు. ముందుగా అశోక వనాన్ని ధ్వంసం చేసి, అక్కడి రాక్షసులని సంహరించాడు. ఆ తరువాత ఇంద్రజిత్తు తనను బంధించినా, రావణుని సభలో అందరూ తనను అవమానించినా ఆయన ఏ ప్రతిచర్య చేయలేదు. ఎందుకంటే అదేదీ ఆ స్వప్నంలో చెప్పబడలేదు. ఒకసారి తన తోకకు నిప్పు అంటగానే మళ్ళీ భగవదాజ్ఞను అమలు పరుస్తూ లంకను కాల్చివేశాడు.

ఆంజనేయుని చూసి మనందరము నేర్చుకోవలసిన ముఖ్య విషయం ఇదే. ఎంతటి ప్రతిభావంతులమైనా, ఆ ప్రతిభను ప్రదర్శించాలని మనస్సు ఎంతగా ఉవ్విళ్ళూరుతున్నా, ఈ ప్రతిభకు కారణమైన మన ప్రభువు పాదాల వద్ద ఒదిగి ఉండి వారి ఆజ్ఞకు బద్ధులై ప్రవర్తించడం నేర్చుకోవాలి. శ్రీమాతాజీ వారు ఎప్పుడూ శ్రీ బాబూజీ మహారాజ్ వారి మాటలను గుర్తు చేసుకుంటూ ఉంటారు – అన్నీ తెలిసి, నేర్చుకొని వుండాలి, కానీ ఏమీ తెలియని వాడిలా ఒక ప్రక్కన ఒదిగి ఉండాలి. అవసరమైనప్పుడు నీ ప్రతిభను సేవకు ఉపయోగించాలి. ఒక్క మాటలో చెప్పాలంటే కారుకు స్టెఫనీ టైరులాగా ఉండాలి – అని.

ఇక్కడ ఆంజనేయుని నుంచి నేర్చుకోవలసింది ఇంకొకటి ఉంది. మనలో చాలామంది ప్రతి చిన్న విషయానికి అవతలివారు తమను అవమానించారని బాధపడిపోతూ ఉంటారు. వారు ఒక మాట అన్నా, ఒక చూపు చూసినా అది తనకు అవమానంగానే భావిస్తూ ఉంటారు. అయితే ముందు నిన్ను నువ్వు గౌరవించుకోవటం నేర్చుకోవాలి. నీ మీద నీకు గౌరవం ఉన్నప్పుడు నిన్ను ఎవరూ అవమానించలేరు. రావణుని సభలో ఆంజనేయుని అవమానించినా, ఆసనం ఇవ్వకున్నా ఆయనేమీ బాధపడలేదు. తన ఆసనం తానే తయారుచేసుకొని వారందరి కంటే ఎత్తుగా కూర్చున్నాడు. నిన్ను నీవు గౌరవించుకోవటం అంటే ఇదే. ఇది అలవరచుకున్న నాడు నిన్నెవరూ అవమానించలేరు.

ఇక ప్రతిభను నియంత్రణలో పెట్టుకోవడం గురించి మరింత లోతుగా విచారిద్దాం. “ఒక కారు వేగంగా వెళ్ళాలంటే ఏం కావాలి?” అని అడిగామనుకోండి ఎవరైనా ఠక్కున “మంచి ఇంజను ఉండాలి, పెట్రోలు నిండుగా ఉండాలి, టైర్లు బాగుండాలి” ఇలాంటివి చెబుతారు. ఇవన్నీ బాగున్నా ఆ బండికి బ్రేకులు సరిగ్గా పనిచేయట్లేదు అనుకోండి ఆ డ్రైవరు వేగంగా వెళ్ళగలుగుతాడా? బిక్కుబిక్కుమంటూ అత్యంత నిదానంగా బండి తోలుతాడు. ఎందుకంటే బండి వేగంగా వెళ్తూ క్షేమంగా గమ్యాన్ని చేరాలంటే బ్రేకులు చాలా అవసరం. ఎంత నియంత్రణ ఉంటే అంత వేగంగా వెళ్ళడానికి అవకాశం ఉంటుంది. మన జీవితం కూడా అంతే. ఎంత నియంత్రణ

వుంటే అంత ఉన్నతికి చేరగలుగుతాం. నేలమీద నడిచేవాడు చాలా తేలికగా నడిచేస్తాడు. కానీ కొండను ఎక్కేవాడు ప్రతి అడుగూ పట్టి పట్టి జాగ్రత్తగా వెయ్యాలి. అప్పుడే పైకి చేరగలుగుతాడు. ఏమాత్రం పట్టు తప్పినా అధోగతే.

ఇంకొక ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఈ ఆంజనేయ అష్టోత్తర శతనామ స్తోత్రం కాళికా రహస్యం అనే గ్రంథంలోనిది. ఆంజనేయుడు ఎలాగైతే అనంతశక్తి సంపన్నుడైనా ఎప్పుడూ శ్రీరామచంద్రుని ఆజ్ఞకు లోబడి ఉంటాడో అలాగే అనంతశక్తి స్వరూపిణి అయిన కాళీమాత కూడా తన ప్రభువైన పరమేశ్వరుని వద్ద ఒదిగి ఉంటుంది. రాక్షస సంహారం చేసి అంతులేని కోపంతో లోకాలనన్నింటినీ భీతావహులను చేస్తున్న ఆ తల్లి తన పతిదేవుని దేహం కాలికి తగలగానే ఒక్కసారిగా శాంతించి భవతారిణీ స్వరూపాన్ని పొంది లోకాలకు అనుగ్రహదాయిని అయ్యింది.

అనంత శక్తి సంపన్నులయినా ఏమీ తెలియని పసిపాపలా ఒదిగి ఉండే తత్త్వం కలిగిన అటువంటి హనుమంతుడు, కాళీమాతల మేలు కలయిక అయిన స్వరూపం మన గురుదేవులు శ్రీ హనుమత్ కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారు. వారినుంచి మనం మొదటగా నేర్చుకోవలసినది ఈ వినయాన్నే. ప్రతిభ ఏ ఒక్కరి సొత్తు కాదు. ప్రతి రంగంలో మనం చూస్తూనే ఉన్నాం. ఎంతో ప్రతిభావంతులైన వారు వారి సమయం వచ్చినప్పుడు ఈ జగన్నాటక రంగం నుంచి నిష్క్రమిస్తే ఆయా రంగాలేమీ అక్కడితో ఆగిపోవట్లేదు కదా! వారి స్థానంలో మరొకరు ఆ ప్రతిభను అందిపుచ్చుకుంటున్నారు. అందరిలో ప్రతిభారూపంలో భాసించే ఆ పరబ్రహ్మ తత్త్వాన్ని గుర్తించిననాడు మనం కూడా అహంకారంతో ఎగరకుండా వినయం మన సహజ భూషణమై ప్రకాశిస్తాము.

శాంత స్వరూపుడును, శేషునిపై శయనించువాడును, నాభియందు పద్మముగలవాడును, దేవతలకధిపతియు, విశ్వరూపుడు, ఆకాశంతో సమమైనవాడును, మేఘమువంటి నల్లని రంగు కలిగిన వాడును, మేలు చేకూర్చే శరీరము కలవాడును, లక్ష్మీదేవికి పతియును, పద్మదళ నేత్రుడును, యోగుల హృదయములకు కనుపించువాడును, సంసార భయమును పోగొట్టువాడువు, సర్వలోకములకు ఏకైక ప్రభువును అయిన శ్రీమహావిష్ణువునకు నమస్కారము.

# ముచికుందా నది

- సన్నిధానం కాళీమాత

గోవిందుడు గోవర్ధన పర్వతాన్ని ఎత్తి గోవులను, గోకులమును భీకరమైన తుఫాన్ నుంచి రక్షించి, ఇంద్రుడికి గర్వభంగం చేశాడు. గోవర్ధన పర్వతాన్ని కార్తీక శుద్ధ పాడ్యమి నుంచి సప్తమి వరకు అంటే ఒక వారం రోజులు మోశాడు. అందుకే కార్తీక శుద్ధ అష్టమినాడు గోపాష్టమిగా పండగ జరుపుకుంటాము. శ్రీకృష్ణుడు గోపాలుడుగా మారిన రోజు గోపాష్టమి. బాలుడైన శ్రీకృష్ణునికి తల్లి యశోద దీక్షా కంకణాన్ని కట్టి గోసేవ దీక్షను ప్రసాదించింది.

ఇనేక ఆపదల నుంచి తమను రక్షించిన శ్రీకృష్ణుడు, కాలనేమి అనే రాక్షసునితో యుద్ధం చేసి, రణభూమి నుంచి పారిపోయి, అదృశ్యమవడం ఎందుకో ద్వారకావాసులకు అర్థం కాలేదు. ఒకసారి, రెండుసార్లు కాదు అప్పటికి ఎనిమిది (8) సార్లు. ఎంతో వీరోచితంగా యుద్ధం చేసినప్పటికి, చివరకు విజయమును కాలనేమి రాక్షసునికే ఇచ్చి, పారిపోయి రావడం. శ్రీకృష్ణుడు ఇలా చేయడం చూసిన నారదుడు, 'ఎందుకు స్వామీ! ఇలా చేస్తున్నావు?' అని ప్రశ్నించగా, 'సమయం రావాలిగా, తొమ్మిదవసారి యుద్ధానికి వెళ్ళినప్పుడు తమాషా చూద్దురు గాని' అని చెప్పాడు.

శ్రీకృష్ణుడి సంకల్పంతో గర్గమహర్షికి, ఒక అప్సరసకు జన్మించాడు కాలయవనుడు. పుత్రుడు జన్మించిన తరువాత అప్సరస తన దారిన తాను వెళ్ళిపోయింది. గర్గుడు తన తపస్సుకు తాను వెళ్ళిపోయాడు. యవన రాజు ఆ పిల్లవాడిని పెంచి పెద్ద చేశాడు. గర్గమహర్షి పుత్రుడు అవడం వలన గొప్ప బలము, తేజస్సు కలవాడయ్యాడు కాలయవనుడు. ఇతడు శివుని గురించి గొప్ప తపస్సు చేశాడు. కాలనేమి అనే రాక్షసుడైన ఇతడు, తన వంశం వారు అనేకమంది విష్ణువు చేతిలో సంహరింపబడ్డారు కనుక, తనకు విష్ణువును జయించే వరం ఇవ్వమని శివుని గురించి తపస్సు చేశాడు. శివుడు తథాస్తు అని వరమిచ్చాడు. ఆ వర గర్వంతో అతడు ద్వారకా పట్టణంపై దండెత్తి శ్రీకృష్ణునితో యుద్ధం చేసేవాడు. అతని వరప్రభావం తెలిసిన కృష్ణుడు అతనికే విజయం కట్టబెట్టి యుద్ధభూమి నుండి అదృశ్యమయ్యేవాడు.

ముచికుందుడనే రాజు విష్ణుభక్తుడు. గొప్ప జ్ఞాని. తపశ్శాలి. ఆయన శ్రీమహావిష్ణువు దర్శనమునకై పరితపిస్తూ కర్మిష్ఠిగా, రాజ్యము పరిపాలిస్తూ, తన తపస్సును కొనసాగించేవాడు. ఒకసారి దేవేంద్రుడు ఆయన దగ్గరకు వచ్చి, నీవు అనేక శస్త్రాస్త్రములు సంపాదించావు కదా! దేవదానవ సంగ్రామములో మాకు సహకరించ వలసినదని అడిగాడు. ముచికుందుడు సరే అని కొన్ని సంవత్సరాలు వారికి యుద్ధంలో సహాయం చేశాడు. రాక్షసులు పారిపోయారు. ఇంద్రుడు చాలా సంతోషించి, 'నీకేమి

వరం కావాలో కోరుకోమన్నాడు. చాలా కాలం యుద్ధం చేశాను కనుక అలసిపోయాను. ప్రశాంతంగా నిద్రపోవాలని వున్నది. తగిన స్థలం చూపించమని అడిగాడు. దేవేంద్రుడు ఒక గుహ చూపించి, 'నువ్వు ఇందులో కొన్ని యుగాలు నిర్విరామంగా నిద్రించు. నీకు ఎవరైనా నిద్రాభంగం కలిగిస్తే, వారు మరుక్షణం భస్మమై బూడిద అయిపోతారు' అని వరం ఇచ్చాడు. ముచికుందుడు ఆ గుహలో నిద్రించసాగాడు.

తొమ్మిదవసారి ద్వారక మీదకి దండెత్తి వచ్చిన కాలయవనుడిని, శ్రీకృష్ణుడు కవ్వింపుగా తనతో తీసుకుపోయాడు. కోట నుండి కాలయవనుడిని చూసి పారిపోతున్నట్లుగా పరుగుతీయసాగాడు. 'ఎక్కడికి పోతావు, నిన్ను చంపకుండా వదలను' అంటూ వెంటబడ్డాడు కాలనేమి రాక్షసుడు. వాడు వస్తున్నాడో లేదో అని మధ్యమధ్యలో ఆగి వెనక్కి తిరిగి చూడటం, వాడు దగ్గరకి రాగానే శ్రీకృష్ణుడు మళ్ళీ పారిపోవడం! అలా పరుగులు తీస్తూ, ముచికుందుడు నిద్రిస్తున్న గుహలోకి వెళ్ళి దాక్కున్నాడు కృష్ణుడు. కాలయవనుడు కూడా గుహలోకి వచ్చి చూస్తే, అంతా చీకటి. నిద్రుస్తున్న ముచికుందుని కాలితో ఒక్క తన్ను తన్నాడు. నిద్రాభంగమైన ముచికుందుడు కళ్ళు తెరచి చూసేసరికి, ఎదురుగా వున్న కాలయవనుడు బూడిద అయిపోయాడు.

శ్రీకృష్ణుడు విష్ణుమూర్తిగా ముచికుందునికి దర్శనమిచ్చాడు. అతడు సంతోషంతో స్వామిని స్తోత్రం చేసి, ఆయనలో లీనమైపోయాడు. అతడు వున్న చోటనే ఒక నది వచ్చింది. అదే ముచికుందా నదిగా పిలవబడుతోంది. దానినే మూసీనదిగా ప్రస్తుతం పిలుస్తున్నారు. భాగ్యనగరం(హైదరాబాద్)లోని ఈ మూసీనది నల్గొండజిల్లా వాడపల్లి అనే గ్రామం దగ్గర కృష్ణానదిలో కలుస్తుంది. అక్కడ ఎత్తుగా ఒక హరిహర క్షేత్రం, గొప్ప నరసింహ స్వామి ఆలయం వున్నది. అగస్త్యేశ్వరుడు అని పిలువబడే ఈశ్వరాలయం వుంది. సంగమ స్థలిలో ఉన్న ఆ గ్రామం గొప్ప నరసింహ క్షేత్రంగా పేరు గాంచింది.

నిజమైన సత్యగురువు లభ్యమయినప్పుడు జన్మాంతర వాసనలన్నీ పటాపంచలవుతాయి. పరిపూర్ణమైన ఆనందం, సంపద, ఐశ్వర్యాలు సంప్రాప్తమవుతాయి. సత్యగురువు కృపా వీక్షణాలు సదా ప్రసారమయ్యే గృహం ఆనందదాయకమే అవుతుంది.

- శ్రీ కాశీబాబు

(గత సంచిక తరువాయి) **శ్రీ మాతాజీ బోధ** -డా. పి. రాఘవేంద్ర

' గురుపాద సన్నిధి, స్థిరమైనపెన్నిధి ...........

మనకు గురు పాదములే నిజమైన పెన్నిధి. ఆ భగవంతుడిని దర్శింప చేసేవాడు, భగవంతుడు బయట ఎక్కడో లేడురా, నీలోనే వున్నాడు, అదే నీవురా, అదే నేను రా" అని అపరోక్షంగా తెలియజేసే వాడే గురుదేవుడు.

గురుదేవుని సన్నిధికి వెళ్ళి, ఏదో మొక్కుబడి తీర్చుకున్నట్లుగా పుష్పములు సమర్పించి ఒక నమస్కారం చేసి వస్తే ప్రయోజనం లేదు. వినమ్రత, భక్తి, శ్రద్ధ లేకుండా అలా చేసే నమస్కారం వ్యాయామం అవుతుంది కాని నమస్కారం మాత్రం కాలేదు. మానవులు సూర్యుడికి అలా నమస్కారాలు చేస్తారు. సూర్య నమస్కారాలు వ్యాయామాలలో కెల్లా మంచి వ్యాయామం. ఆ సూర్య నమస్కారాలకి సంతోషించి భాస్కరుడు వారికి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాడు. సూర్యుడికి గ్రహణం పట్టడం అనేది వుంది. కానీ జ్ఞాన భాస్కరుడైన గురుదేవులకు మాత్రం ఏ గ్రహణం లేదు. జ్ఞాన భాస్కరుడైన గురుదేవుని నుండి జ్ఞాన కిరణాల కాంతి ఎల్లప్పుడూ ప్రసరిస్తూనే వున్నది. కాని అది నీకు సోకకుండా, నీకు నీవే అడ్డు గోడ కట్టుకున్నావు. ఆ అడ్డుగోడ పేరే "నేను".

బాబూజీ దివ్య మంగళ మూర్తిని చాలామంది కేవలం విగ్రహంగా భావిస్తారు. ప్రతిష్టించటానికి ఆ విగ్రహాన్ని మోయాలి కాబోలు అని కూడా అనుకుంటున్నారు. కానీ మీరందరూ ఆ మూర్తిలో తత్వపూర్ణుడైన గురుదేవుని మాత్రమే దర్శించగలగడం అభ్యాసం చేయాలి. నీవు ఏం మాట్లాడాలో, నీ ద్వారా తాను ఏం మాట్లాడాలో, ఆ భగవంతుడే చూసుకుంటాడు.

జైపూర్‌లో మేమంతా పూజలు చేస్తుంటే అక్కడ శిల్పులంతా ప్రతిష్ట అయ్యేవరకు మమ్మల్ని పూజలు దూరంగా చేసుకోవాలని లేకపోతే మూర్తి అపవిత్రం అవుతుందని అన్నారు. అసలు ప్రతిష్ట అంటే ఏమిటి? బాబూజీని ఎక్కడ ప్రతిష్టించాలి. ఈ ఉదయం నుంచీ మనం చేస్తున్నవన్నీ భక్తి తత్వంతోనే చేస్తున్న క్రియలు. నిజానికి అన్నిటిని మించి ఆ గురుదేవుని నీ హృదయ సింహాసనం పైన ప్రతిష్టించుకోవాలి. అందుకే

బాబూజీ ఎప్పుడు “మీ హృదయ బాబు” అని అంటుండేవారు. ఆ హృదయ బాబు అయిన మన గురుదేవులు ఏం చెప్పారు? “నన్ను నమ్ము. నమ్మితే బంగారమే” అని చెప్పారు. గురి తప్పని నిజ దృష్టికి మాత్రమే లభించే గుర్తు తానే, అంటే ఆ సద్గురుదేవులే అని ఆ గురుపాదుకలు అందరినీ హెచ్చరిస్తున్నాయి.

ఎప్పుడు మానవుడికి మరుపు వస్తుందో, గురుదేవుణ్ణి మర్చిపోతాడో, అదే అతని మరణం. ఎంత కాలం మానవుడు ఆ గురు నామాన్ని గుర్తించుకొని స్మరిస్తాడో ఆ కాలం మాత్రమే అతడి నిత్యకాలంలో జమ అవుతుంది. అందుకే గురుదేవుణ్ణి నిరంతరం స్మరిస్తూ గుర్తించుకోవాలి. నీవు నిజంగా ఎవరివో నీకు గుర్తు తెలియ చేసేవాడే సమర్థ సద్గురుదేవుడు, మన హృదయ బాబు.

మల్లెపూలతో గురుదేవుని పూజిస్తే అవి సాయంత్రానికల్లా వాడిపోవచ్చు. కానీ అదే నీ మనోపుష్పంతో అర్చిస్తే, ఆ మనోపుష్పం వాడిపోయేది కాదు. పైగా భగవంతుడు కోరేది కూడా నీ హృదయ కుసుమాన్నే. అందుకే మీరు భక్తితో మీ హృదయ కుసుమాలను సద్గురు దేవునికి సమర్పించండి. అలా చేస్తే మీలో భక్తి కలుగుతుంది. ఒకసారి భక్తి కలిగితే చాలు, సాధన ఏమీ కష్టమనిపించదు. భక్తి పూర్ణమైన హృదయానికి అసలు నేను ఇంత సేపు సాధన చేశాను అన్న లెక్కే వుండదు. మీకందరికీ ఉదయము ఒక గంట సాయంత్రం ఒక గంట ప్రార్థన చేసుకోండి అని చెప్పడం దేనికంటే, అది లేకపోతే మీలో కొందరు ఆ మాత్రం సాధన కూడా చేయలేరు కనుక.

- సశేషం

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఈ క్రింది మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***డిసెంబర్ 2025 :*** AS 6271, 6309, 6822, 7159, 7192, 7592, 8554, 8555, 8556, 8557, 8558, 8559, 8566, 8571, 9264, 9269, 9295, PK 0108

***జనవరి 2026 :*** AS 5457, 6483, 8594, 8598, 9203, PK 0109, 0110

# భగవద్గీత సాధన దీపిక

(గత సంచిక తరువాయి) - కీ.శే. శ్రీ గూడా శివ రామమూర్తి

శ్రీకృష్ణ భగవానుడు ఇప్పుడు అర్జునుడికి ఆత్మను గురించి గాని లేదా బ్రహ్మమును గురించి గాని చెప్పబోతున్నాడు అని నీవు అనుకోవచ్చు. కాని, శ్రీకృష్ణ భగవానుడు అలా చేయలేదు. ముందుగా అర్జునుడికి కలిగిన సందేహములను, అతని దౌర్బల్యమును, త్రికరణముల మధ్య వ్యత్యాసమును తొలగించకుండా నేరుగా యోగాన్ని ఉపదేశిస్తే అది ఫలించదు. అందువలన శ్రీకృష్ణ భగవానుడు ముందుగా అర్జునుడి సందేహాలను తీర్చి, త్రికరణముల మధ్య సామ్యమును కల్పించే ప్రయత్నం చేస్తున్నాడు.



శ్రీ కృష్ణ భగవానుడు అర్జునుడితో కొంచెం పరుషంగా "నీవు ఏదో తెలివైన వాడిలా మాట్లాడుతున్నావు. కాని నీ ప్రవర్తన మాత్రం అందుకు పూర్తిగా భిన్నంగా ఉన్నది" అన్నాడు. అర్జునుడిలోని, అలాగే నీలోని సాధకుణ్ణి తట్టి మేలుకొలపటమే శ్రీకృష్ణ భగవానుడు అలా అనటంలోని ప్రధానోద్ధేశ్యం. ఇది అర్జునుడికి ఎంత వర్తిస్తుందో, నీకు కూడా అంతే వర్తిస్తుంది. ఎందుకంటే, నీవు నీ జీవితంలోకి తొంగి చూస్తే, నీకు కూడా ఆత్మానుభూతిని పొందాలి అన్న అత్యంత ఉన్నత ఆశయం ఉన్నది. కాని నీ ప్రవర్తన, నీ జీవన విధానం మాత్రం ఆ ఆశయ సాధనకు అనుగుణంగా ఉండక దానికి పూర్తిగా విరుద్ధంగా ఉంటుంది.

ఈ జగత్తు అంతా అసత్తు అని తెలిసి కూడా నీవు విషయాదుల వెంట పరిగెత్తుతూ ఉంటావు. కనీసం జగత్తు అసత్తు, మిథ్య అని తెలుసుకొన్న తర్వాత అయినా నీవు నీ జీవితాన్ని సరి అయిన మార్గంలో నడిపించాలి. లేకపోతే గీతలోని బోధామృతాన్ని నీవు ఎన్నటికీ సరిగా గ్రహించలేవు. కేవలం ఉదాత్తమూ, ఉన్నతమూ అయిన ఆధ్యాత్మిక ఆదర్శాలు ఉన్నంత మాత్రాన, లేదా ఆ ఆదర్శాలను వల్లించినంత మాత్రాన కలిగే ప్రయోజనం ఏ పాటిది? రాగద్వేషాలకు, సుఖ దుఃఖాది ద్వంద్వాలకు లోనై నీవు అతి సాధారణమూ, అధమమూ అయిన జీవితం

గడుపుతూ ఉన్నంతవరకూ, కేవలం ఉన్నతమైన ఆశయాలు, ఆదర్శాలు ఉన్నందువలన ఏమీ ప్రయోజనం ఉండదు. నీవు ఉదాత్తమైన విషయాలను గూర్చి మాట్లాడతావు. చాలా గంభీరమైన ఉపన్యాసాలు ఇస్తావు. కాని నీ జీవితం మాత్రం అధమాధమమైనదిగా ఉంటుంది. అలా జీవించినందువలన ఏం లాభం?

అందుకే శ్రీరామకృష్ణ పరమహంస "ఆధ్యాత్మికతకు మొదటి మెట్టుగా నీవు ముందు త్రికరణముల మధ్య సామ్యమును సాధించు" అన్నారు. నీవు మనసులో ఒకటి అనుకుంటావు. కాని మాట్లాడటం దగ్గరికి వచ్చేసరికి, నీవు మాట్లాడేది, నీవు అనుకున్న దానికన్న భిన్నంగా ఉంటుంది. ఇక చేతల దగ్గరికి వచ్చేసరికి, నీ చేతలు ఆ రెండింటికన్నా భిన్నంగా ఉంటాయి. శ్రీకృష్ణ భగవానుడు చెప్పిన దాని సారాంశం ఏమంటే, అర్జునుడిలో ఉన్న ఆధ్యాత్మిక చింతన వంటి ఆధ్యాత్మిక చింతనకు, కేవలం నీ సంభాషణలనో, లేదా నీ మనోభావాలనో, కాకపోతే నీ భావోద్వేగాన్నో మాత్రమే ప్రభావితం చేసే శక్తి ఉంటుంది. కాని దాని వలన ప్రయోజనం ఏమిటి? దానికి నీ వ్యక్తిత్వాన్ని, లేదా నీ జీవితాన్ని లేదా అసలు నిన్నే పూర్తిగా మార్చివేయగల శక్తి లేదు.

నీ సంగతే తీసుకొని చూస్తే, నీ బ్రతుకంతా జగత్తులోనే గడపవలసి ఉంటుంది. నీ ఆదర్శాలు, ఆశయాలు మాత్రం ఉన్నతంగా ఉంటాయి. ఆ ఆశయాలను సాధించాలి అంటే, నిన్ను నీవు భగవంతుడే కర్త, అన్నీ నిర్వహించేవాడు అని, నీవు కేవలం నిమిత్తమాత్రుడవు అనే ఎఱుకతో, నిరంతర ధ్యానం చెయ్యాలి. అలా కాకుండా, ఒకవైపు సంసారాసక్తిని వదలకుండానే, మరొకవైపు సాధన కూడా సాగించాలి అనుకుంటే అది చిల్లుకుండను నీళ్ళతో నింపటానికి ప్రయత్నించినట్లు ఉంటుంది. అసలు నీకున్న బంధాలను గురించి కూడా నీకు పూర్తిగా తెలియదు. నీవు ఉదాత్తమైన విషయాలను గురించి ఉపన్యాసాలిస్తావు. చర్చిస్తావు. కాని నీ బుద్ధి మాత్రం విషయాల నుండి విడివడి ఇవతలకు రాదు. అలా ఉన్నంతకాలం నీకు ఉత్తమభావాలు కలగటం తప్ప అంతకన్నా ఏమీ లభించదు.

- సశేషం

# హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు

సేకరణ - మురళీ

సూర్యనారాయణ 1864 ఆగష్టు 31న ఇప్పటి విజయనగరం జిల్లా, బొబ్బిలి వద్ద, ప్రస్తుతం బలిజిపేట మండలంలో ఉన్న అజ్జాడ గ్రామంలో లక్ష్మీ నరసమాంబ, వేంకటచయనులు దంపతులకు జన్మించాడు. హరికథకుడిగా ప్రసిద్ధి చెందాక, ఆయన నారాయణదాసుగా ప్రఖ్యాతిగాంచాడు. పేదరికం కారణంగా చిన్నతనంలో బడికి వెళ్ళలేక పోయినా, పద్యాలు, శ్లోకాలు విని, కంఠతా పట్టి తిరిగి వల్లించేవాడు.

కేవలం ఐదేళ్ళ చిరు ప్రాయంలోనే, భాగవతంలోని పద్యాలు ఎన్నో చెప్పేవాడట. ఒకసారి వారి అమ్మగారు పిల్లవాడిని గుంప గ్రామంలోని సంగమేశ్వర పుణ్యక్షేత్రానికి తీసుకువెళ్ళిందట. అక్కడ పుస్తకాల కొట్టులో, భాగవతం చూసి (బాల దాసు) అది కావాలి అని మారాం చేస్తుంటే, ఆ కొట్టు యజమాని, భాగవతం నీకేమి అర్థమవుతుంది అన్నాడట. అంతే ఆ కుర్రవాడు ఆపకుండా భాగవతంలోని పద్యాలు గడగడా చెప్పేశాడట. అది చూసి, ఆ కొట్టు యజమాని ఆనందంగా పిల్లవానికి ఆ పుస్తకంతో పాటు, కొంత దక్షిణ కూడా ఇచ్చి పంపించాడుట.

ఒకసారి దాసు వాళ్ళ తాతగారింటికి వెళ్ళడం జరిగింది. అక్కడ అరుగు మీద కూర్చుని రాగయుక్తంగా పద్యాలు పాడుతూ ఉంటే, అది చూసి వాళ్ళ తాతగారు ముచ్చటపడి, తన దగ్గరే ఉంచుకుని సంగీతం నేర్పుతానని వాళ్ళ అమ్మగారికి చెప్పాడట. దాంతో అప్పటిదాకా, ఎటో సాగుతున్న నావకి చుక్కాని దొరికినట్లైంది. ఒక ప్రక్క సంగీత సాధన, ఇంకో ప్రక్క విద్యాభ్యాసం. ఇలా రెంటినీ అతను ఎంతో నేర్పుగా సంబాళించ గలిగాడు చిన్నవయసులోనే. తన 14 వ ఏట ఒకటవ తరగతిలో చేరాడు.

పాండిత్య ప్రకర్ష:

తెలుగు, సంస్కృతం, తమిళం, హిందీ, బెంగాలీ, ఉర్దూ, ఆంగ్లం, అరబ్బీ, పారశీకం భాషలలో ఆయన ప్రావీణ్యం సంపాదించాడు. అష్టావధానాలు చేసేవాడు. అచ్చతెలుగులోను, సంస్కృతంలోను, సంస్కృతభూయిష్టమైన తెలుగులోను కూడా వివిధ విషయాలపై శతాధిక గ్రంథాలు రచించిన మహా పండితుడు. 1922లో ప్రచురితమైన నవరస తరంగిణి – ఇందులో సంస్కృత మహాకవి, నాటక కర్త కాళిదాసు రచనలనుండి, ఆంగ్లభాషలో ప్రసిద్ధ నాటక రచయిత షేక్స్పియర్ రచనలనుండి నవరసాలను వర్ణించే ఖండికలను తెలుగులోకి అనువదించి చూపాడు. ఇదొక గొప్ప రచన. కాని ఆయన రచనలలో ఉద్గ్రంథంగా చెప్పబడేది జగజ్యోతి అనే తాత్విక రచన. వివిధ భారతీయ తాత్వికుల సిద్ధాంతాలను, దృక్పథాలనూ ఈ గ్రంథంలో వివరించాడు. నాస్తిక వాదాలు కూడా విస్తృతంగా చర్చింపబడ్డాయి.

దశవిధ రాగ నవతి కుసుమ మంజరి అనే పాటలో మంజరీ వృత్తంలో 90 రాగాలు కూర్చాడు. అంతవరకూ ఎవరూ సాహసించని ఈ ప్రక్రియ సంగీతంలోనూ,

కవితలోనూ నారాయణదాసుకు ఉన్న ప్రతిభకు తార్కాణం. ఋక్సంగ్రహం అనే బృహత్తర కావ్యంలో ఈయన ఋగ్వేదములోని 300 పైచిలుకు ఋక్కులకు సంగీతాన్ని సమకూర్చి, వాటిని వీణమీద వాయించడం విద్యార్థులకు నేర్పాడు. ఆ ఋక్కులను తెలుగులో గీతాలుగా అనువదించాడు.

నారాయణదాసు సంగీత ప్రతిభ ఆయన సాహితీ ప్రకర్షకు సమస్థాయిలో పరిమళించింది. ఆనాటి సంగీత విద్వాంసులు ఆయనను లయబ్రహ్మ అనీ, పంచముఖి పరమేశ్వర అనీ సన్మానించారు. ఒకేమారు ఐదు తాళాలకు అనుగుణంగా పాడడం ఆయన ప్రత్యేకత. ఈ పంచముఖి ప్రదర్శనలో నారాయణదాసు రెండు చేతులు, రెండు కాళ్ళు, తలలతో ఐదు తాళాలకూ దరువు చూపేవాడు. అప్పుడు ఆయనకు ఐదుగురు వివిధ వాద్యకారులు సహకరించేవారు. సంగీత సాహిత్య స్వర బ్రహ్మ అని ఆయనకు బిరుదు ప్రసాదించారు.

విజయనగరం రాజుగారు నారాయణ దాసును తన ఆస్థాన విద్వాంసునిగా నియమించాడు. ఒకసారి సభలో ఆయన దాసును ఏదో రాగం పాడమని అడిగాడట. కానీ ఆయన నేను పాడను అని సభలో నుండి వెళ్ళిపోయాడట. రాజుగారు కూడా దానికి ఏమి కోపం తెచ్చుకోలేదు. ఐతే తరువాత ఆయన వ్యాయామశాలలో వ్యాయామం చేస్తున్నప్పుడు, ఎందుకో ఆ రాగం గుర్తుకు వచ్చి, పాడడం మొదలుపెట్టారట. నిమిషాలు గడుస్తున్నాయి, గంటలు గడుస్తున్నాయి. చుట్టూరా జనాలు ఉన్నారు. కానీ ఇవేవీ పట్టించుకొనే స్థితిలో లేడు నారాయణ దాసు. చివరికి పాడడం అయిన తరువాత చూసుకుంటే ఒంటి మీద కేవలం గోచీ తప్ప ఏదీ లేదట. ఆ రాగం విన్న ప్రజలంతా ఆనందంతో ఇంటికి వెళ్ళిపోయారు. అలా వెళ్ళిపోయిన ఆ జనంలో, ఆనంద గజపతి రాజు కూడా ఉన్నాడట!

అయితే ఈయనకే ప్రత్యేకమైన హరికథని వెలుగులోకి తెచ్చింది మాత్రం జయంతి రామదాసు. అతని ప్రోద్బలంతో, మొదటి హరికథా కాలక్షేపానికి రంగం సిద్ధమైంది. మొదటిది రాజమండ్రిలో ఏర్పాటు చేశారు. ఇప్పటిలా కరెంటు లేదు. మైకులు, సౌండ్ బాక్స్లు లేవు. ఉన్నదల్లా, ఇసుక వేస్తే రాలనంత జనం, మధ్యలో వేదిక మీద నారాయణ దాసు. అంతే, ఉన్నట్లుండి మ్రోగింది కంచు కంఠం. ఊరంతా ఉలిక్కి పడింది. గంభీరమైన ఆకారం, ఒక చేతిలో చిడతలు, కాళ్ళకి గజ్జెలు. అలా మొదటి హరికథకి అంకురార్పణ జరిగింది.

ఇక ఆ తరువాత నారాయణ దాసు వెనక్కి తిరిగి చూసుకోలేదు. అతని ఖ్యాతి వాడవాడలా వ్యాపించింది. మైసూర్ మహారాజు గారి నుండి ఆహ్వానం అందింది. మైసూర్ రాజా హరికథకి ముగ్ధుడైపోయాడు. దీనితో పాటు, వీణాగానం కూడా అడిగి మరీ విన్నాడు. పెద్దయెత్తున బహుమతులు సమర్పించాడు. కవిత్వం, సంగీతం, నాట్యం అనే మూడు రంగాలలోనూ తనకున్న ప్రతిభను జోడించి నారాయణదాసు హరికథ

అనే కళను అత్యున్నత శిఖరాలకు కొనిపోయాడు. ఈ మూడింటి కలయికకూ భక్తి అనే భావం ప్రాణంగా హరికథలు రచించాడు, చెప్పాడు, నేర్పాడు. ఆయన హరికథ వినడం ఒక గొప్ప అనుభూతిగా అప్పటివారు చెప్పుకొనేవారు. మొత్తం ఆయన తెలుగులో 17, సంస్కృతంలో 3, అచ్చతెలుగులో ఒకటి హరికథలను రచించాడు. కొన్నిమార్లు ఒక్కొక్క వర్ణన నాలుగైదు పేజీల నిడివి వరకూ సాగేవి.

ఈయన సకల కళా నైపుణ్యానికి ముచ్చటపడిన బ్రిటీష్ వారు ఆయనను నోబుల్ పురస్కారానికి నామినేట్ చేద్దామనుకున్నారట. కానీ నారాయణదాసు ఒప్పుకోలేదట. తన జీవితం మొత్తం, తాను జన్మించిన తెలుగు గడ్డకి తన వంతు సేవ చేసి, 1945, జనవరి 2వ తేదీన మరణించాడు.

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

*** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును***

డిసెంబర్ 2025

1 సోమ: మార్గశిర శుద్ధ ఏకాదశి – గీతాజయంతి, శ్రీమద్భగవద్గీతా పారాయణ, శ్రీ సద్గురు పాదపూజ.

4 గురు: మార్గశిర పూర్ణిమ – దత్త జయంతి, శ్రీ సద్గురు పాదపూజ.

14 ఆది: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ

16 మంగళ: ధనుర్మాస వ్రత ప్రారంభం – ధనుర్మాసంలో ప్రతిరోజు ఉ. 5.00 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ.

25 గురు: క్రిస్మస్ – శ్రీ సద్గురు పాదపూజ.

30 మంగళ: ముక్కోటి ఏకాదశి. – శ్రీ సద్గురు పాదపూజ.

జనవరి 2026

1 గురు: ఆంగ్ల సంవత్సరాది – శ్రీ సద్గురు పాదపూజ.

3 శని: పుష్య పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ

13 మంగళ: శ్రీ గురుదశమి – శ్రీ సద్గురు పాదపూజ.

14 బుధ: భోగి పండుగ – శ్రీ సద్గురు పాదపూజ.

15 గురు: సంక్రాంతి పండుగ – శ్రీ సద్గురు పాదపూజ.

23 శుక్ర: మాఘ శుద్ధ పంచమి – శ్రీ సద్గురు పాదపూజ.

25 ఆది: మాఘ శుద్ధ సప్తమి – శ్రీ సద్గురు పాదపూజ.

29 గురు: మాఘ శుద్ధ ఏకాదశి – శ్రీ సద్గురు పాదపూజ.

# శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్ వారి సహస్ర నామావళిః

(గత సంచిక తరువాయి) -పాలూరి ప్రసాద్

**81. ఓం ప్రభవే నమః**

శ్రీ గురుదేవులు ఈ సకల చరాచర సృష్టికి మూలమైన వారు. వారిలోనుండే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులనబడే త్రిమూర్తులు, సకల విశ్వం సృష్టింపబడ్డాయి. వారే ఈ ప్రపంచమంతటికీ అధినేత.

**82. ఓం రామ నామ జప ధ్యాన ప్రీతాయ నమః**

శ్రీ గురుదేవులు నిరంతరం రామ నామాన్ని జపిస్తూ, ధ్యానిస్తూ ఆ ఆనందంలో లీనమై ఉంటారు. వారు స్వయంగా శ్రీరామచంద్ర ప్రభువు అవతారమే అయినా మనకు మార్గ దర్శనం చేయటం కోసం వారు అలా నిరంతర జప ధ్యాన మగ్నులై ఉంటారు. శ్రీగురుదేవులు వైద్య నిమిత్తం అమెరికా దేశాన్ని సందర్శించినపుడు అక్కడ వైద్యులు దీనిని ప్రత్యక్షంగా అనుభూతి చెందగలిగారు.

**83. ఓం మారుతి సన్నిభాయ నమః**

శ్రీ గురుదేవులు సాక్షాత్తు హనుమత్ స్వరూపులు. పైన చెప్పిన విధంగా హనుమంతుని వలెనే నిరంతరం వారు రామ నామ జపం చేస్తూ ఉంటారు. ఎందరో భక్తులకు, ఆకు పూజ చేసుకొనే సందర్భంలో వారు శ్రీ హనుమంతుని అవతారంగా దర్శనమిచ్చారు.

**84. ఓం కామాది శత్రు సంహారాయ నమః**

శ్రీ గురుదేవులు తమను ఆశ్రయించిన శిష్యుల మనస్సులోని కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలను, అహంకార, మమకారాలను పూర్తిగా హరించి వారికి స్వస్వరూప జ్ఞానాన్ని, తద్వారా మోక్షాన్ని ప్రసాదించగల సమర్థ సద్గురు దేవులు.

**85. ఓం కామితార్థ ప్రదాయకాయ నమః**

శ్రీగురుదేవులు తమ భక్తుల యొక్క ఇహ పర సంబంధమైన అన్ని కోర్కెలను తీర్చగల సమర్థులు. అయితే వారి ధర్మపరమైన కోర్కెలను తీరుస్తున్నట్లుగా కనిపిస్తూనే మెల్లగా వారిని సత్య మార్గంలో నడిపింప చేసి చివరికి వారిని కోర్కెలు లేని వారిగా తీర్చి దిద్దుతారు.

**86. ఓం అజ్ఞాన బంధుర ధ్వాంత హారక జ్ఞాన భాస్కరాయ నమః**

శ్రీ గురుదేవులు అజ్ఞానమనే చీకటితో నిండిన శిష్యుల హృదయాలలో జ్ఞాన

కిరణాలను ప్రసరింప చేసే సూర్యుని వంటి వారు. ఏ విధంగా సూర్యోదయం కాగానే చీకట్లు నశించి జగత్తంతా వెలుగు నిండుతుందో అదే విధంగా శ్రీగురుదేవుల కృప కలగగానే శిష్యుని హృదయంలో అజ్ఞానం నశించి జ్ఞాన జ్యోతి కాంతితో ప్రకాశిస్తాడు.

**87. ఓం సుజ్ఞాన భాగ్య సంధాన నైపుణీయుత వాఙ్మయాయ నమః**

శ్రీగురుదేవులు తమ శిష్యులకు సుజ్ఞానమనే భాగ్యాన్ని కలిగించగల బోధామృతమును అందించుటలో నిపుణులు. వారు తమ దివ్య జ్ఞాన బోధ చేత తమ భక్తుల హృదయాలలోని అజ్ఞాన అంధకారాన్ని (దారిద్ర్యాన్ని) రూపు మాపి వారికి జ్ఞానమనే సంపదను, మోక్ష సామ్రాజ్యాన్ని అనుగ్రహిస్తారు.

**88. ఓం దృష్టి ప్రసారమాత్రేణ బహుళాపన్నివారకాయ నమః**

శ్రీ గురుదేవులు కేవలం తమ చల్లని చూపులు ప్రసరింపచేసి తమను ఆశ్రయించిన వారి యొక్క అనేకములైన ఆపదలను, కష్టములను నివారించగల సమర్థులు. ఇది మనలో చాలా మందికి అనుభవంలో ఉన్న విషయమే. ఏదేని శారీరక, మానసిక, ప్రాపంచిక బాధతో వారిని ఆశ్రయించిన వారికి కేవలం ఒక చల్లని చూపు ద్వారా, ఒక తియ్యని వాక్కు ద్వారా వారు స్వస్థతను చేకూర్చెడి వారు. శ్రీగురుదేవులు సర్వాత్మస్వరూపులై అంతటా వ్యాపించియుండుటచే వారి దృష్టి విశ్వమంతా ప్రసరిస్తూ వారిని ఆశ్రయించిన వారిని, ఆ ఆశ్రితుల కుటుంబాలను సదా కంటికి రెప్పవలె కాపాడుతూ వుంటుంది.

**89. ఓం దూరీకృత మహా పాపాయ నమః**

ఏ విధంగా అగ్ని తనతో సంపర్కం కలిగిన అన్ని వస్తువుల యొక్క అపవిత్రతను తొలగించి వాటిని శుద్ధమైన విభూతిగా మారుస్తుందో అదే విధంగా శ్రీగురుదేవులు తమను భక్తితో విశ్వాసంతో ఆశ్రయించిన వారి పాపాలను పోగొట్టి వారిని శుద్ధ సత్వ గుణ స్వరూపులుగా మార్చగల సమర్థులు. అగ్నికి మలినం అంటనట్లే వారికి ఏ మహా పాపములు అంటవు.

**90. ఓం దయాళవే నమః**

శ్రీ గురుదేవులు పరమ దయా స్వరూపులు. తమను ఆశ్రయించి సేవించిన వారినే కాక తమను విమర్శించిన, దూషించిన వారిపై కూడా వారు దయా రసాన్ని వర్షిస్తారు. వారి దయకు జాతి నీతి భేదములు గానీ, స్వపర భేదములు గానీ లేవు.


- సశేషం

# శ్యామ సుందరా! ఒక్కసారి,
# ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ!

(గత సంచిక తరువాయి)

- కీ.శే. రమణ ప్రసాద్

దేవకీ వసుదేవులు – రథం వసుదేవుడి భవనం చేరింది. ద్వారపాలకులు తమ చేతిలోని ఆయుధాలను దించి, తలలు వాల్చి నిల్చున్నారు. దారుకుడు రథాన్ని నిలిపాడు. అశ్వాలు అంతకుముందే వారి మనోగతాన్ని గ్రహించినట్లు ఆగిపోయాయి. అర్జునుడు రథం దిగాలి. కాని ఇంకా గాండీవం సహాయంతో రథం మీద అలా నిల్చుని ఉండిపోయాడు. అర్జునుడి మనస్సులో ఏవేవో ఆలోచనలు, గతస్మృతులు అన్నీ కలగాపులగం అయి పరిభ్రమిస్తున్నాయి. తను కొద్ది క్షణాలలో వసుదేవుణ్ణి కలుస్తాడు. ఆయన పరమ ఆప్తుడు. వయోభారం తన ప్రభావాన్ని ఆయన మీద బాగా చూపుతున్నది. అంతలోనే దేవకీదేవి గుర్తు వచ్చింది. ఆ మాతృదేవత ఎంత అభాగ్యురాలు! శ్రీకృష్ణుడికి జన్మనిచ్చి వెంటనే ఆ పసివాడిని త్యాగం చేసింది. ఆ తల్లి హృదయం ఎంత తల్లడిల్లిందో! జీవితం అంతా ఆ తల్లి అలా త్యాగమయిగానే ఉండిపోయింది. ఆ పుత్రుడు సామాన్యుడా! సాక్షాత్తు శ్రీమన్నారాయణుని పూర్ణావతారము. అంతటి యుగావతారుడైన పుత్రుణ్ణి పొంది కూడా ఆ వృద్ధ దంపతులు తమ జీవిత చరమాంకంలో దుస్సహ పుత్రవియోగ బాధను అనుభవించవలసి రావటం ఎంత దురదృష్టకరం! ఇంక కొన్ని క్షణాలలో తాను విరాట్పురుషుని తండ్రి, అభాగ్యుడైన వసుదేవుని పాదాలకు ప్రణామం చేస్తాడు.



అప్పుడు.... 'కృష్ణా! కృష్ణా!" అర్జునుడు బిగ్గరగా అరిచాడు. అర్జునుడి మనస్సులో మహాభారతయుద్ధం ముగిసి తాను, శీకృష్ణుడు రథం దిగే సమయం ఆసన్నమైనప్పటి దృశ్యం మనస్సులో మెదిలింది. తాను రథికుడుగా సారథి స్థానంలో కూర్చుని తనకు విజయాన్ని చేకూర్చిన శ్రీకృష్ణుణ్ణి ముందు రథం దిగమన్నాడు. కాని తన ప్రభువు తనను వెంటనే ముందు రథంలోనించి దూకేయమని తను దూకగానే స్వామికూడా ఆలస్యం చేయకుండా దూకేశాడు. ప్రభూ! ఆనాడు నీవే ముందు రథం దిగి ఉంటే ఏమి జరిగి ఉండేది? ఊహించటానికి కూడా భయం వేస్తోంది. ఒళ్ళు గగ్గుర్పొడుస్తోంది. అంతవరకు నీ ప్రభావంతో అణచిపెట్టబడిన శత్రువీరుల దివ్యాస్త్ర

జ్వాలలు అప్పుడు విజృంభించి రథం ఒక్కసారిగా భగ్గున మండిపోతుంటే ఆ మహాగ్ని జ్వాలలలో నేనుకూడా భస్మం అయిఉండేవాణ్ణి. అనుక్షణము – కనురెప్ప పడటం అయినా ఆలస్యం అవుతుందేమో – అంతకంటే ముందరే నీవు అందిస్తూ వచ్చిన రక్షణను తల్చుకుంటే నా హృదయం కరిగి నీరౌతున్నది. కాని నీవు నన్ను ముందు రథంలోనుంచి దూకమని ఆదేశించావు. అలా జరిగి ఉండని పక్షంలో... ఆ దుర్భర సన్నివేశాన్ని ఊహించుకోవాలంటే కూడా భయం వేస్తోంది. కాని అలా జరిగి ఉంటేనే బాగుండేదేమో, ఇప్పుడు నా హృదయాన్ని ముక్కలు ముక్కలు చేస్తున్న ఈ ప్రాణాంతకమైన విష ఘడియలు వచ్చి ఉండేవి కాదు” అనుకున్నాడు. కాని విధిని ఎవరు తప్పించగలరు? ఆ విషఘడియ రానే వచ్చింది.

కృష్ణుడు లేని ద్వారకలో అడుగు పెట్టాలి అని తలచుకుంటేనే అర్జునుడికి భయం వేస్తున్నది. దారుకుడి పరిస్థితి కూడ అలాగే ఉంది. అతడు వణికిపోతున్నాడు. గుఱ్ఱాలు కూడ ముందుకు పోమని మొరాయిస్తున్నాయి. దారుకుడు తన బాధ్యత నుండి తప్పుకోలేడని అర్జునుడికి బాగా తెలుసు. ద్వారక ప్రవేశించటం అనే అతి దుష్కరమైన కర్తవ్యాన్ని ఎలాగోలా వాళ్ళు నెరవేర్చాలి. ద్వారక ప్రవేశించకా తప్పదు. దేవకీ వసుదేవుల సమక్షంలో నిలబడకా తప్పదు.


దేవకీ వసుదేవులు బాగా పెద్దవాళ్ళు అయ్యారు. వృద్ధాప్యం తరువాత ఇంకా ఏదైనా అవస్థ ఉండి ఉంటే వాళ్ళు ఆ అవస్థలో అడుగు పెట్టారు అనవచ్చు. అంతకంటే కూడ ఆ అవస్థే వారిని గ్రసించింది అంటే సత్యానికి దగ్గరగా ఉంటుందేమో. వారు మధురనుంచి వచ్చిన తరువాత ద్వారక పొలిమేరలు దాటి ఎరుగరు. ద్వారక బయటకు వెళ్ళి ఎన్నో యుగాలు గడిచినట్లుగా ఉంది. వసుదేవుడి పరిస్థితి మరీ దుర్భరం. శిథిలమైన ఎముకలగూడులో ఉన్న ఆ జీవుడు ఇంకా శ్వాస పీలుస్తున్నాడు. ఆశ్చర్యంగా గుండె ఇంకా కొట్టుకుంటున్నది. అయితే ఇప్పటికీ ఆ వృద్ధుడి జ్ఞాపకాలలో తాను చెరసాలనుండి కుంభవృష్టి కురుస్తూ ఉండగా, పసికందుగా ఉన్న శ్రీకృష్ణుని ఒక తట్టలో ఉంచి తలపై పెట్టుకొని, ఒడ్డులను ఒరుసుకుంటూ పొంగి పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తున్న యమున మధ్యలోనుండి గోకులానికి వెళ్ళి, ఆ శిశువును యశోదమ్మ ప్రక్కలో పరుండబెట్టి యశోదమ్మకు జన్మించిన ఆడశిశువును తీసికొని మధురకు తిరిగి చెరసాలలోకి రావటం కళ్ళకు కట్టినట్లు కనిపిస్తున్నది. కంసుడు తన ఆరుగురు సంతానాన్ని రాతిపై విసిరికొట్టి పొట్టన పెట్టుకున్న మరపురాని రాక్షసకృత్యం తాలూకు భయంకరమైన జ్ఞాపకాలు పీడకలలా అతనిని ఇప్పటికి కలవరపెడుతూ ఉన్నాయి.

- సశేషం

# నారద భక్తి సూత్రములు

- వారణాసి కాళీ ప్రసాద్ U.S.A

భక్తి సూత్రము 48: **యః కర్మ ఫలం త్యజతి, కర్మాణి సంన్యస్యతి, తతో నిర్ద్వంద్వో భవతి**



తాత్పర్యము: ఎవరు కర్మ ఫలములను వదిలి, కర్మలను సన్యసిస్తారో, ద్వంద్వాతీతులగుదురో (వారు తరిస్తారు).

నారదుల వారు "ఎవరు తరిస్తారు" అన్న ప్రశ్నకి ఇస్తున్న సమాధానమును ఈ సూత్రములో కొనసాగిస్తూ ఎవరైతే కర్మఫలమును త్యజించి, కర్మలను సన్యసించి, తద్వారా నిర్ద్వంద్వ స్థితిని చేరుతారో వారే మాయను దాటగలరు అని సెలవిస్తున్నారు.

గీతాచార్యులు భగవద్గీతలో **"యోగక్షేమం వహామ్యహం"** అని తెలిపినప్పుడు కర్మలను చేయవలసిన అవసరమేమున్నదని ఆలోచించ రాదు. ఎందుకంటే ఆయనే భగవద్గీతలో **"న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్"** అంటూ కర్మ చేయకుండా ఒక్క క్షణం కూడా ఎవరూ ఉండలేమని తెలియజేస్తారు.

అయితే ఈ కర్మలు నిత్య కర్మలు లేక స్వాభావిక కర్మలు, నైమిత్తిక కర్మలు మరియు సకామ కర్మలు అని మూడు రకాలుగా ఉంటాయి. నిత్య కర్మలు చేయడము శరీర పోషణకు అత్యవసరము. స్నాన పాన భోజనాదులు మొదలగు నిత్య కర్మలు దేహమున్నంత కాలము తప్పవు. నైమిత్తిక కర్మలు శుభాశుభ నిమిత్తముల ప్రకారము చేయబడే కర్మలు. ఈ నిత్య నైమిత్తిక కర్మలు రెండింటి వలన భావి భోగ్య ఫలము కలుగదు కానీ సకామ కర్మలు మాత్రం ఫలమును కోరి చేయబడే కర్మలు. వాటి ఫలమును అనుభవించక తప్పదు.

సాధన పరిణామ క్రమంలో కర్మఫలం త్యజతి అంటే కర్మ ఫల త్యాగము చేసి, ఫలాపేక్ష లేకుండా ఉన్న సాధకుడు తదుపరి ఉన్నత స్థితికి చేరుకున్న తరువాత సకామ కర్మలను కూడా సన్యసిస్తాడు అని గ్రహించాలి. సకామ కర్మలను సన్యసించడం అంత సులభం కాదు కాబట్టి సాధకుడు మొట్టమొదటగా కర్మల యొక్క ఫలమును ఆశించక

ఫలాపేక్ష లేని స్థితిని చేరుకోవాలి. తదుపరి ఆ ఫలములను భగవంతునికే అర్పణ చేయగలగాలి. ఆ సమర్పణను సూచించడానికి "సంన్యస్యతి" అన్న శబ్దమును నారదుల వారు ఇక్కడ ప్రయోగించారు. ఈ రెండింటిని సాధించిన తర్వాత ద్వంద్వాతీత స్థితిని సాధకుడు చేరుకుంటాడు. అప్పుడు శీతోష్ణములు, సుఖదుఃఖాలు, జయాపజయాలు వంటి ద్వంద్వములకు కట్టుబడి ఉండడని నారదులు ఈ సూత్రము ద్వారా తెలియచేస్తున్నారు.

భక్తి సూత్రము 49: **యో వేదానపి సంన్యస్యతి, కేవలం అవిచ్ఛిన్న అనురాగం లభతే**

**తాత్పర్యము:** ఎవరు వేద నిర్దిష్టమైన ధర్మములను కూడా త్యజించునో (అంతటి పరిపక్వత సాధించునో), వారికి అవిచ్ఛిన్నంగా భగవంతుని అనురాగం లభ్యమౌతుంది.

ఈ సూత్రమును సాధనా క్రమములో పై సూత్రము తర్వాత అనుసంధానం చేసుకోవాలి. ఈ సూత్రమును నిశితంగా పరిశీలించక పోతే తప్పగా అర్థం చేసుకునే ప్రమాదం కూడా ఉంది. ఎవరైతే వేదములను కూడా సన్యసిస్తారో వారికి అవిచ్ఛిన్నమైన అనురాగం లభిస్తుందన్న భావము పైకి కనిపిస్తుంది. కానీ ఇక్కడ గ్రహించవలసినది ఏమంటే వేదములలో కర్మకాండ, జ్ఞానకాండ అని రెండు భాగాలు వుంటాయి. కర్మకాండమును అంతఃకరణ శుద్ధి కొరకు అవలంబించాలి. చివరకు జ్ఞానకాండ ద్వారా సత్యమును ఎరిగి తనను తాను భగవంతుని ప్రతిరూపముగా తెలుసుకున్న నాడు సాధకుడికి కర్మకాండలో నిర్దేశింపబడిన కర్మలు వాటంతటవే విడువడి పోతాయి. ఈ విషయమునే నారదుల వారు "**వేదానపి సంన్యస్యతి**" అంటూ ఆ సిద్ధ స్థితిలో ఉన్న సాధకుడి గురించి తెలియజేస్తున్నారు. జ్ఞానోదయం అయిన తరువాత కర్మాచరణ దానంతట అదే వదులుతుందని, ఏరు దాటిన తర్వాత పడవతో ఇక పని ఉండదని దీని సారాంశం. మరి ఆ సిద్ధావస్థలో ఉన్నవారికి అవిచ్ఛిన్నమైన ఎడతెగని అనురాగము భగవానుని పట్ల కలిగి ఉంటుంది. ఆ అనురాగమునే పరాభక్తిగా నారదులు అభివర్ణిస్తున్నారు. అయితే ఆ స్థితి చేరుకునే వరకు సాధకుడు వేదములలో యుక్తమైన వాటిని ఆచరిస్తూ అయుక్తములైన వాటిని వదిలివేయాలి. దీనిని గీతాచార్యులు "స్వధర్మము" అని భగవద్గీతలో వివరిస్తారు. క్రమముగా ఆచరణను భగవంతుడికి సమర్పణ భావముతో కొనసాగిస్తూ పరిణతి

చెందిన సాధకుడు సిద్ధ స్థితిని చేరిన నాడు సమస్త కర్మములు వాటికవే వదిలిపోతాయి. **“త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున”** అని సాంఖ్య యోగములో గీతాచార్యులు అర్జునుడికి చెప్పిన విషయంలోని రహస్యం ఇదే.

భక్తి సూత్రము 50: **స తరతి స తరతి, లోకాం తారయతి.**

**తాత్పర్యము:** అటువంటి (పైన సూత్రములలో వివరించినట్లు) పరా భక్తుడు తాను తరించడమే కాక లోకములను కూడా తరింప చేయగలడు.

ముందు వివరించినట్లు సాధకుడు పరిణామ క్రమములో అభివృద్ధి చెందుతూ, వివరింపబడిన లక్షణములను పాటించగలిగితే అప్పుడు వారు మాయను దాటగలరు అని నారదుల వారు ఈ సూత్రంలో తెలియచేస్తున్నారు. అటువంటి స్థితిలో ఉన్న సాధకులు సిద్ధావస్థను చేరి తాను మాయను దాటడమే గాక ఇతరులను కూడా దాటించగల స్థితిని చేరుకుంటారు. వివేక చూడామణిలో శంకర భగవత్పాదులు వారు కూడా సద్గురువుల యొక్క లక్షణములను **“స్వయం తీర్ణాః పరాం తారయంతి”** అని వివరిస్తూ మహాత్ములు వారు తరించి, ఇతరులను తరింప చేస్తారని తెలిపారు.

శ్రీ బాబూజీ మహారాజ్ వారు ఈ విషయమునే ప్రస్తావిస్తూ పరశువేది ఇనుముని బంగారముగా మార్చగలదు గాని మరొక పరశు వేదిని తయారు చేయలేదని కేవలం సమర్థ సద్గురు దేవులు మాత్రమే శిష్యులను తమంతటివారిగా తీర్చిదిద్దగలరని తెలియజేశారు.

ఎప్పుడైతే వ్యక్తి నైష్కర్మ్య సిద్ధితో ఉండగలడో, అప్పుడు అలౌకిక ఆధ్యాత్మిక జ్ఞానము నిజమైన అనుభవంగా తెలుస్తుంది. ఆ జ్ఞానంలో స్థితమై ఉన్నప్పుడు, సాధకుడు భగవత్ ప్రాప్తిలో పరిపూర్ణత సాధిస్తాడనీ, ఇతరులను కూడా తరింప చేయగలడని వివరిస్తూ నారదుల వారు భక్తి సూత్రములలోని మూడవ అధ్యాయమును పూర్తి చేస్తున్నారు. నాలుగవ అధ్యాయములో పరమ భక్తుల లక్షణాలను వివరిస్తారు.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమ కార్యక్రమాలు

**డిసెంబర్ 2025**

1 సోమ: మార్గశిర శుద్ధ ఏకాదశి – గీతాజయంతి, శ్రీమద్భగవద్గీత పారాయణ, శ్రీ సద్గురు పాదపూజ.

3 బుధ –శ్రీ సద్గురుదేవులు స్వసరూప లయం చెందిన రోజు. శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

4 గురు: మార్గశిర పూర్ణిమ – దత్త జయంతి, శ్రీ సద్గురు పాదపూజ.

14 ఆది: శ్రీగురుదశమి – శ్రీసద్గురు పాదపూజ

16 మంగళ: ధనుర్మాస వ్రత ప్రారంభం – తిరుప్పావై, ఋషులచరిత్ర, భాగవత ప్రవచనం.

18 గురు: మాసశివరాత్రి

19 శుక్ర; అమావాస్య

25 గురు: క్రిస్మస్ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

28 ఆది: పుష్య శుద్ధ నవమి – శ్రీ రామలక్ష్మీ ప్రసాద మాతాజీ వారి తృతీయ వార్షిక ఆరాధన – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

30 మంగళ: ముక్కోటి ఏకాదశి – ఉత్తరద్వార దర్శనం, శ్రీ సద్గురు పాదపూజ. భక్త సమారాధన.

**జనవరి 2026**

1 గురు: ఆంగ్ల సంవత్సరాది – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

3 శని: పుష్య పూర్ణిమ – శ్రీ సద్గురు పాదపూజ

7 బుధ: పుష్య బహుళ పంచమి – శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన

13 మంగళ: శ్రీ గురుదశమి – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

14 బుధ: భోగి పండుగ – సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

15 గురు: సంక్రాంతి పండుగ – ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

16 శుక్ర; కనుమ పండగ

17 శని : మాసశివరాత్రి

18 ఆది: అమావాస్య

23 శుక్ర; మాఘ శుద్ధ పంచమి – వసంత పంచమి, శ్రీ సరస్వతీ పూజ,

25 ఆది: మాఘ శుద్ధ సప్తమి – రథసప్తమి

29 గురు: మాఘ శుద్ధ ఏకాదశి – భీష్మ ఏకాదశి. సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

## ధనమా-దైవమా - పెనుమాక నాగేశ్వర రావు

ధనమా- దైవమా! ప్రహ్లాదుడేపాటి పసిడి కానుక లిచ్చే, మద గజంబెన్నిచ్చే మౌక్తికములు, నారదుండెన్నిచ్చే నగలు, రత్నంబులు, అహల్య నీకే అగ్రహారమిచ్చే, ఉడుత నీకేపాటి ఊడిగంబులు చేసే? ఘన విభీషణుడు ఏమి కట్నమిచ్చే? పంచపాండవులేమి లంచమిచ్చిరి నీకు, ద్రౌపది నీకెంత ద్రవ్యమిచ్చే, నీకు వీరందరైనట్లు నేను గానా? ఎందుకని నన్ను రక్షింపవు ఇందు వదనా! భూషణ వికాస శ్రీధర్మపుర నివాస దుష్టసంహార నరసింహ దురితదూర అని ఓ భక్తశిఖామణి ఆక్రోశించినా,

కలడందురు దీనులయెడ

కలడందురు పరమయోగి గణములపాలన్

గలడందురన్ని దిశలను

కలడు కలండనెడువాడు కలడో? లేడో? అని గజేంద్రుడు క్షణకాలం సందేహించినా,

భరతునకు చేయిస్తి పచ్చలపతకము రామచంద్రా

ఆ పతకమునకు బట్టె పదివేల వరహాలు రామచంద్రా? ఇక్ష్వాకు కులతిలక!

శత్రుఘ్నునకు నేను చేయిస్తి మొలత్రాడు రామచంద్రా!

ఆ మొలత్రాడునకు బట్టె మొహరీలు పదివేలు రామచంద్రా? ఇక్ష్వాకు కులతిలక?

లక్ష్మణునకు జేయిస్తి ముత్యాల పతకము రామచంద్రా

ఆ పతకమునకు బట్టె పదివేల వరహాలు రామచంద్రా? ఇక్ష్వాకు కులతిలక!

సీతమ్మకు చేయిస్తి చింతాక పతకము రామచంద్రా!

ఆ పతకమునకు బట్టె పదివేల వరహాలు రామచంద్రా? ఇక్ష్వాకు కులతిలక?

మీ తండ్రి దశరథ మహారాజు పెట్టెనా రామచంద్రా

లేక మీమామ జనక మహారాజు పంపెనా రామచంద్రా? ఇక్ష్వాకు కులతిలక?

చుట్టు ప్రాకారములు సొంపుగ చేయిస్తి రామచంద్రా

ఆ ప్రాకారమునకు బట్టె పదివేల వరహాలు రామచంద్రా? ఇక్ష్వాకు కులతిలక?
అని మరో భక్తాగ్రేసరుడు లెక్కలు చెప్పి ఆవేదన వెలిబుచ్చినా,
సేవలు గొనుటయే గాని, సేవించుటెరుంగని అట్టి శ్రీనాధుడే నా సేవకుడయ్యెను, హరీ...... హరి భక్తావళికి విధేయుడనుట అనృతమగునే!
అని తపోధనులు అచ్చెరువొందినా,
నీకెందుకు ముడుపులు, వడ్డికాసులు, నీ సతీ నీకొసగుచుండ సిరుల రాశులు,
ఔరౌరా నీ లీలలు తెలియరానివి, అఖిలాండమే నిలచినా, నిలువబోనివి
పదునాలుగు భువనాలను పాలించేవు, పదభక్తులకేల ఈ శోధనలు
దీనజనుల మొరలన్నీ ఆలించేవు, తీర్చగలవు నీవే మా వేదనలు
సప్తగిరులపై వెలసి వేంకటేశా, ఆప్తుడవైనావు భువికి శ్రీనివాసా! అని కీర్తించినా
కలవారినే గాని కరుణించలేడా, నిరుపేద మొరలేమీ వినిపించుకోడా అని ప్రశ్నించినా,
ఆదిభిక్షువు వాడినేది కోరేది... బూడిదిచ్చేవాడినేది అడిగేది? అని నిందాస్తుతి చేసినా,
రోజుకు లక్షల్లో దైవదర్శనాలు చేసుకుంటున్నారు. కోట్లల్లో కానుకలు సమర్పించుకుంటున్నారు.
సిరికింజెప్పడు, శంఖుచక్ర ..................... భక్తులను కాపాడేందుకు భగవంతుండు అలా అరుదెంచుతాడనటానికి ఎన్ని నిదర్శనాలు చూపాడు. నిండుకుండలా ఉండే నిరాకారుడు!
దేవుడు ధనం ఇవ్వగలడు గాని, ధనం దేవుడ్ని కొనిపెట్టలేదు. అయినా ఆయన దయకు మించిన ధనం ఏముంది కాబట్టి?
అందుచేత ...........
మదిలో నీదగు మూర్తినిల్పుకొని సంభావింతుమే కాని నిను
ఇదమిత్థంబని నిర్ణయింప వశమా ? యెవ్వారికిన్, నమ్మి నీ
పదరాజీవము లాశ్రయించితిమి లోపంబేమి? నీ వారమే గదా,
రక్షింపక నీకు తప్పదుగదా! కాళీప్రసాదప్రభూ! అని మనసారా వేడుకుందాం.

# శ్రీ బాబూజీతో నా ప్రయాణం

- జి. విజయకృష్ణ (బుజ్జి)

(గత సంచిక తరువాయి)

2023లో నా గుండెపోటు తర్వాత, మూడు నెలలకొకసారి గుండెపోటు పరీక్షలు సర్వసాధారణమయ్యాయి. అవసరమైనప్పుడు రెండవ మరియు మూడవ అభిప్రాయాలను తీసుకుంటూ నేను క్రమం తప్పకుండా ఉండేవాడిని. అలా జరిగినది ఏమిటంటే, మాకు తెలిసిన కార్డియాలజిస్ట్, నా సన్నిహితుడి కుటుంబ స్నేహితుడు పరిచయం చేయబడ్డారు. నా భార్యతో కలిసి మేము శనివారం గుండె పరీక్ష కోసం వెళ్ళాము, తరువాతి సంఘటనలు జరగడానికి ముందు. తగిన జాగ్రత్తలు తీసుకున్న తర్వాత, ఈ కార్డియాలజిస్ట్ నేను ఎటువంటి అనారోగ్యము లేకుండా తగినంత ఫిట్‌గా ఉన్నానని ప్రకటించాడు, కానీ స్టంట్ ధమని లోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాల అయినందున సకాలంలో యాంజియోగ్రామ్ చేయించుకోవాలని నాకు సిఫార్సు చేశాడు.

మే 12వ తేదీ ప్రారంభ వారానికి ఈ యాంజియోను ప్లాన్ చేసాను. ఎందుకంటే ఇది ఇప్పటికే శనివారం వారాంతం కాబట్టి. ఆ తర్వాత సోమవారం, నేను నా ఆఫీసుకి వెళ్ళాను. నాకు ఎటువంటి సమస్యలు లేకుండా ఒక సాధారణ రోజు గడిచింది. నేను ఇంటికి బయలుదేరుతున్నప్పుడు ఒక వింత అసౌకర్యం కలిగి నా రక్తపోటును త్వరగా తనిఖీ చేసుకోవడానికి ఫ్యాక్టరీ ఆసుపత్రిలో ఆగిపోవాలని నిర్ణయించుకున్నాను.

డ్యూటీలో ఉన్న నర్సు నా బిపిని తనిఖీ చేసిన తర్వాత దానిని ECG తో కొనసాగించమని సూచించింది, ఆమె ECG నివేదికలో కొన్ని మార్పులను చూడగలిగినందున నేను ఇంటికి తిరిగి వెళ్ళడానికి అనర్హుడని ప్రకటించింది. అయినప్పటికీ ఆమె ECG నివేదికలో లోపం ఏమిటో గుర్తించలేకపోయింది. నన్ను అక్కడి నుండి నగరంలోని కేర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ నేను రెగ్యులర్ కార్డియాలజిస్ట్ ప్రాక్టీస్ చేసే చోటికి ఆఫీసు కారులో ఆసుపత్రి నర్సుతో పాటు వెళ్ళాను. ఆసుపత్రికి వెళ్ళేటప్పుడు నేను నా భార్యకు ఫోన్ చేసి ఆసుపత్రికి దగ్గరగా ఉన్న నా ఇంటి నుండి నా పాత నివేదికలన్నింటినీ తీసుకురావాలని చెప్పాను.

నేను చేరుకున్నప్పుడు నా భార్య రిపోర్ట్‌లతో పాటు ఆసుపత్రిలో ఉంది. నన్ను వెంటనే అత్యవసర గదికి తరలించారు. అక్కడ ప్రోటోకాల్ ప్రకారం అవసరమైన పరీక్షలు జరిగాయి. ఆ తర్వాత వారు ఎటువంటి అత్యవసర పరిస్థితి లేదని ప్రకటించారు. అప్పుడే నాతో పాటు వచ్చిన నర్సు ఫ్యాక్టరీ ఆసుపత్రిలోని వారికి ECG చూపించింది, దీనిని చూసిన అత్యవసర బృందం నా గుండె నిజంగా లయ తప్పిందని నిర్ధారించింది.

మే 12, 2025: ఆ తర్వాత ఆసుపత్రిలో త్వరగా చేరాను. అక్కడ నేను రాత్రిపూట పరిశీలనలో ఉంచబడ్డాను. నా ఇల్లు సమీపంలోనే వుండటం వల్ల, రాత్రిపూట ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే, ఆమె కేవలం కాల్ దూరంలోనే ఉండటం వల్ల రాత్రి భోజనం తర్వాత ఆసుపత్రి సిబ్బంది నా భార్యను ఇంటికి వెళ్ళమని కోరారు.

మే 12/13, 2025: ఆమె వెళ్ళిపోయిన తర్వాత సంఘటనలు జరగడం ప్రారంభించాయి. అత్యవసర ప్రక్రియ వెంటనే చేపట్టాలని నిర్ణయించినందున వారు నా కార్డియాలజిస్ట్ మరియు భార్య ఇద్దరినీ పిలవవలసి వచ్చింది (అంటే) పేస్‌మేకర్‌ను ఉంచడానికి. ఈ ప్రక్రియ అర్ధరాత్రి తర్వాత ప్రారంభమైంది. నేను తిరిగి ICU లో ఉన్నాను, ఆ తర్వాత వెంటనే నా కుడి చీలమండ పైన తాత్కాలిక పేస్‌మేకర్‌ను పెట్టారు. ఇది తరువాతి మూడు రోజులు నా కుడి కాలులో ఎటువంటి కదలికలను నిరోధించింది, నా గుండె తట్టుకుంటుందా లేదా అని వారు గమనించారు.

పేస్‌మేకర్ లేకుండా, శారీరకంగా ఆరోగ్యంగా మరియు చురుకైన సేవా అధికారికి, ఒక కాలు మీద కదలిక లేకుండా మంచానికి కట్టివేయబడటం ఒక భయంకరమైన అనుభవం. మూడు రోజుల తరువాత, నా గుండెకు పూర్తి సమయం పేస్‌మేకర్ అవసరమని వైద్యులు నిర్ధారించారు, ఇది చాలా సరళమైన మరియు సాధారణ ప్రక్రియ.

- సశేషం

# నిరీక్షణ

(గత సంచిక తరువాయి)

తమిళ మూలం - శ్రీ ఆర్. సంపత్
తెలుగు అనువాదం - శశికళా దివాకర్

పదితలల రావణుని ముఖం కోపంతో ఎరుపెక్కింది. "నా చెరసాలలో బంధింపబడియుండియూ ముల్లోకములను గజగజ వణికించదగు పరాక్రమముగల నన్ను అవమానించితివి. నేను రాముడు లేని సమయమున నిన్ను అపహరించి తీసుకుని వచ్చినది ఆతనితో యుద్ధముజేయ భయపడి మాత్రం కాదు. అలా నేను ఆతనితో యుద్ధముజేసి, ఆతనిని సంహరించినట్లైతే నీవు ప్రాణత్యాగం చేస్తావని భయపడి, ఆతడు లేని సమయమున నిన్ను తీసుకుని వచ్చాను. నేను యుద్ధభూమిలో నిలిచి పోరాడినచో నన్నెదిరించు వారెవరూ లేరు. జరిగింది ఏదో జరిగిపోయింది. ఇంకా రెండునెలల సమయము గడువు గలదు. ఈలోపల నీవు మనసు మార్చుకుని నా అంతఃపురమునకు చేరుకో. లేని పక్షమున నీవు ఆహారముగ మారి నా ఉదరములోనికి చేరుకొనెదవు" అని కఠినమైన తన గొంతుతో గర్జనచేయు విధమున బదులిచ్చి, అచ్చట కాపలాగా ఉన్న రాక్షస స్త్రీలను జూచి, "మీరెవ్వరూ మీకు అప్పగించిన పనిని సరిగ్గా నిర్వహించుట లేదు. ఎలాగైనా ఆమె మనసును మార్చ ప్రయత్నించండి!" అని వారిని బెదిరించి అచ్చోటనుండి నిష్క్రమించాడు రావణుడు.

ఆతడు వెళ్ళిపోయిన పిదప అచ్చోట సీతకు కాపలాగ ఉన్న రాక్షసస్త్రీలు ఆమె చెంతకు వచ్చి, రావణుని కీర్తిప్రతిష్టలను, శ్రేష్టతను వివరించి, మంచిగను, ఆశజూపి, భయపెట్టి (సామ, దాన, బేధ, దండోపాయములు) ఆమెను తమ దారికి తెచ్చుకొన ప్రయత్నించారు. "నీవు గనుక మా రాజును స్వీకరించకపోయినట్లైతే మేమే నిన్ను చంపివేసెదము" అన్నది వాళ్ళలో ఒక రాక్షసస్త్రీ. అప్పుడే అక్కడకు వచ్చిన త్రిజట (రావణుని తమ్ముడు విభీషణుని కుమార్తె) వారినందరిని హెచ్చరించి, "కఠినమైన మనస్సు గలవారా! మీ మీ నోళ్ళు మూసుకోండి. ఇంకా రెండు మాసములలో లంకానగర పరిస్థితి మారిపోవునన్నది నిశ్చయం. నిన్న బ్రహ్మ ముహూర్తమున నేను ఒక కలగన్నాను. అందు

రావణుడు, కుంభకర్ణుడు, ఇంద్రజిత్తు ముగ్గురూ రాక్షససైన్యము వెంటరాగ, శరీరమంతా బూడిదను పూసుకుని, గోని చుట్టుకుని దక్షిణదిశ వైపుకు వెళ్ళుచున్నారు. సీతయొక్క భర్త ఇక్కడకు వచ్చి, ఆమెను ఒక విమానముపై కూర్చుండబెట్టుకుని వెళ్ళుచున్నాడు.

ఈ కల అర్థమును మీకు సూక్ష్మంగా చెప్పుచున్నాను. రాముని విజయము, రావణుని అపజయము తథ్యము. అప్పుడు మీయొక్క పరిస్థితిని తలచుకుని చూడండి" అన్నది త్రిజట ఆ రాక్షస స్త్రీలందరినీ ఉద్దేశించి. ఆమె మాటలను వినిన వారందరూ భయమొంది విశ్రమించు నిమిత్తమై అక్కడనుండి వెళ్ళిపోయారు. వెక్కి వెక్కి రోదిస్తున్న సీతను జూచి, త్రిజట ఆమె చెంతకు వెడలి, ఆమెను తలపై ప్రేమతో నిమిరి, తన తండ్రి భవంతికి వెళ్ళిపోయింది.

ఒంటరిగ మిగిలిపోయిన సీత దుఃఖంలో తన పరిస్థితిని గూర్చి ఆలోచన చేసింది. 'నా మనసుకు ప్రియమైన రాముడు సముద్రమును దాటి, ఇక్కడకు రాగలడా? ఒకవేళ అలా వచ్చి రావణునితో పోరాడి, సంహరించిన పిదప అన్యదేశ చెరసాలలో బంధింపబడియున్న నన్ను మరల భార్యగ స్వీకరిస్తారా? ఏదేమైనా సరే ఒక పౌర్ణమి గడచిన పిదప నేను ఆ రాక్షసునకు ఆహారమైపోవుటకంటే, ఇప్పడే నేను ఎందులకు ఆత్మహత్య చేసుకోకూడదు?' అనుకున్న సీత మనసును ధృడపరచుకుని ఆ కార్యమునకు పూనుకుంది.

సీత కూర్చున్న చెట్టుపై దాక్కుని ఉన్న హనుమంతుడు ఆమె సన్నటి కొమ్మను తన మెడ చుట్టూ చుట్టుకొనుటను గమనించాడు. "అయ్యయ్యో! ఏమి ఈ వైపరీత్యము!? అమ్మ ఆత్మహత్య చేసుకున్నట్లైతే రామునితో సహా అందరూ అలానే ఆత్మహత్య గావించుకొనెదరు కదా? ధైర్యం కోల్పోయిన స్థితిలో సీత చేసుకున్న ఈ నిర్ణయమును ఎలాగైనా నివారించ వలయును' అని తలచి మెల్లగ తన గొంతును విప్పి మాట్లాడ నారంభించాడు.

- సశేషం

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

కార్యక్రమాలలో ఏమైనా మార్పులు వుంటే ఎప్పటికప్పుడు హైదరాబాద్ శాఖ వారి వాట్సప్ గ్రూప్‌లో తెలుపబడును......

**డిసెంబర్ 2025**

1 సోమ: గీతాజయంతి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

3 బుధ: శ్రీగురుదేవులు స్వస్వరూప లయం చెందిన తేదీ – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

4 గురు: మార్గశిర పూర్ణిమ, దత్త జయంతి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

25 గురు: క్రిస్మస్ – ఉ.11.00 గం.లకు సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

30 మంగళ: ముక్కోటి ఏకాదశి. – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**జనవరి 2026**

1 గురు: ఆంగ్ల సంవత్సరాది – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

3 శని: పుష్య పూర్ణిమ – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

13 మంగళ: శ్రీ గురుదశమి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

14 బుధ: భోగి పండుగ – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

15 గురు: సంక్రాంతి పండుగ – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

23 శుక్ర: మాఘ శుద్ధ పంచమి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

25 ఆది: మాఘ శుద్ధ సప్తమి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

29 గురు: మాఘ శుద్ధ ఏకాదశి – సా.5.30 గం.లకు సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

(గత సంచిక తరువాయి) **శ్రీ గురుగీతా** -కీ.శే డా॥వి.వి. ప్రసాదరావు

## అథ ప్రథమోధ్యాయః

**కాశీక్షేత్రం నివాసశ్చ జాహ్నవీ చరణోదకమ్**
**గురుర్విశ్వేశ్వర స్సాక్షాత్ తారకం బ్రహ్మనిశ్చయః. 37**

**<u>పదవిభాగము</u>** :-

కాశీక్షేత్రం-నివాసః-జాహ్నవీ-చరణోదకం-గురుః-విశ్వేశ్వరః-
సాక్షాత్- తారకం-బ్రహ్మనిశ్చయః.

**<u>టీక</u>** :- (గురోః) నివాసః = గురుదేవుడు నివసించే స్థలమే; కాశీక్షేత్రం = కాశియను పుణ్యక్షేత్రము; (గురోః) చరణోదకం = గురుదేవుని పాదతీర్థము; జాహ్నవీ = పావనమగు గంగానది; గురుః = గురుదేవుడే; సాక్షాత్ = ప్రత్యక్ష; విశ్వేశ్వరః = విశ్వేశ్వరుడు; (గురుబోధిత) బ్రహ్మనిశ్చయః = నిశ్చిత బ్రహ్మ జ్ఞానము; తారకం = తారక మంత్రము.

**<u>వ్యాఖ్య</u>** :- "గురుదేవుడు నివసించు స్థలమే కాశీక్షేత్రము, ఆయన పాదతీర్థమే పావనమైన గంగ, ఆయనయే ప్రత్యక్ష విశ్వేశ్వరుడు, ఆయన బోధించిన బ్రహ్మ నిశ్చయమే తారకమంత్ర" మని సాక్షాత్పరమ శివుడే యీ శ్లోకంలో తెలియ జేస్తున్నాడు. కాశీక్షేత్రనివాసం చేస్తూ, గంగానదిలో స్నానంచేస్తూ, కాశీలో జీవించిన వారికి మరణ సమయంలో సాక్షాత్తు కాశీ విశ్వనాథుడే తారక మంత్రోపదేశం చేస్తాడన్నది స్మృతి ప్రసిద్ధము. అయితే యిక్కడ పరమ శివుడే ఇంకొక సూక్ష్మ విధానాన్ని తెలియజేస్తున్నాడు. కాశీకి వెళ్తే కాటికి వెళ్ళినట్లనుకొనే కాశీకి వెళ్ళనక్కరలేదు. నీ గురుదేవుడి సన్నిధే కాశీ, బహువిశాలమైన కాశీ నగరమంతా పర్యటించి అవస్థ పడనక్కరలేదు. నీ గురువు పాదం మోపిన స్థలాన్ని తాకి నమస్కరిస్తే చాలు, సగంకాలిన శవాలతో, చెయ్యిపెడితే గడ్డకట్టుకు పోయేటట్లున్న అతి చల్లని గంగానదిలో నీవు మునగ నవసరంలేదు. గురుపాద తీర్థం ఒక్క చుక్క నీ శిరస్సుపై సంప్రోక్షించుకుంటే చాలు, ఆ ఒక్క చుక్కా నీ సమస్త కలుషములనూ హరిస్తుంది. అనేక ద్వారాలుండి, రద్దీగా ఉండే ఆలయంలోకి వెళ్ళి కష్టపడి విశ్వేశ్వర దర్శనం చెయ్యనక్కరలేదు, నీ గురుదేవుడే విశ్వేశ్వరుడు. కాశీలో విశ్వనాథుడు జీవుడి ప్రాణోత్క్రమణ సమయంలో కాని తారకోపదేశం చెయ్యడు, ఒక వేళ అలా తారక

మంత్రాన్ని పొందినా స్వర్గాదులైన ఏ ఉన్నత లోకాలకో వెళ్తేనే గాని నీకు సద్గతి లభించదు. ఇక నీ గురుదేవుడంటావా! నిన్ను ఏ క్షణంలో కావాలంటే ఆ క్షణంలో ఉన్నచోటనే ముక్తుణ్ణి చెయ్యగలడు. అందువల్ల లింగరూపంలో ఉన్న కాశీ విశ్వేశ్వరుడి కన్నా, సజీవ విశ్వనాథుడైన నీ గురుదేవుణ్ణే భక్తి శ్రద్ధలతో ఉపాసించమని ఈ శ్లోకం చెబుతున్నది. అంతేకాదు గురుకృప పొందాలంటే "చతుర్విధ శుశ్రూషలైన (1) స్థాన శుశ్రూష, 2) అంగ శుశ్రూష, 3) భావ శుశ్రూష, 4) ఆత్మ శుశ్రూషలు ఆచరించాలి. స్థాన శుశ్రూష అంటే గురుడెక్కడెక్కడ సంచరిస్తాడో అక్కడక్కడికి ఆయనతో సంచరించి, ఆయన కొనసాగించే కార్యక్రమాలలో తోడ్పడటం. అంగశుశ్రూష అంటే గురుదేవుడు ఏ విధమైన కార్యాచరణతో తన శరీరమును పరమ పవిత్రం చేసుకున్నాడో ఆ కార్యాచరణను పాటించి తన శరీరాన్ని కూడ పవిత్రీకృతం చేసుకోవటం, భావ శుశ్రూష అంటే గురువు ఏ దివ్యభావంతో సర్వ జగత్తునూ బ్రహ్మమయంగా దర్శిస్తాడో ఆ భావంతో తాను కూడ ఆనందించటం. ఆత్మశుశ్రూష అంటే గురుదేవుడెలా స్వస్వరూప స్థితిలో నిలచి బ్రహ్మమయుడౌతాడో, ఆ స్థితిని తానూ పొందటం, ఇది కాక గురువున్న క్షేత్రాన్ని, గురు శరీరాన్ని, గురు భావ పరంపరనూ, గుర్వభీష్టాన్ని సేవించుకోవటం కూడ భౌతికమైన చతుర్విధ శుశ్రూషా నిర్వహణం అనవచ్చును.

- సశేషం

**శ్రీ సద్గురు దేవుల సప్త త్రింశతి (37)వ**
**పుణ్యారాధన మహోత్సవాలు**
**8-11-25 నుండి 16-11-25 వరకు**

శ్రీ సద్గురు మండల దీక్ష నామ పారాయణ 7-10-25 నుండి 16-11-25 వరకు

1 కోటి 3 లక్షల 22 వేలు

శ్రీ సద్గురు కోటి నామ పారాయణ 8-11-25 నుండి 16-11-25 వరకు

1 కోటి 20 లక్షలు

శ్రీ సద్గురు మండల పారాయణ (దీక్ష లేకుండా) 9-10-25 నుండి 16-11-25 వరకు

22 లక్షల 28 వేలు

మొత్తం 2 కోట్ల 45 లక్షల 50 వేలు

# శ్రీ బాబూజీతో నా అనుభవాలు

- ఇందుకూరి శర్మిష్ఠ

నా చిన్నతనంలో శ్రీ బాబూజీ మహరాజ్ వారు ఉండి(భీమవరం దగ్గరి ఊరు) స్వామీజీతో కలిసి నింద్రకొలనులో మా యింటికి వచ్చారు. నేను వచ్చిన వారందిరికీ మంచితీర్థం యిచ్చేసరికి నాన్నగారు, అమ్మ, బందా తాతయ్య గారు, నింద్రకొలను డాక్టరుగారు నమస్కారాలు చేసుకున్నారు. నాన్నగారు నన్ను కూడా నమస్కారం చేసుకోమని సైగ చేశారు. శ్రీ బాబూజీని చూడటం నాకు అదే మొదటి సారి. ఎవరికి నమస్కారం చేసుకోవాలో అర్థం కాక కళ్ళు మూసుకున్నాను. ఒక్క క్షణం శ్రీబాబూజీ వారి శ్రీకృష్ణ కాళీయమర్ధన నృత్యం దర్శనం అయ్యింది. నేను దిగ్భ్రమకు లోనై, వెంటనే శ్రీ బాబూజీ వారికి నమస్కారం చేసుకున్నాను. మొదటి నమస్కారంలోనే ఏదో తెలియని అనుభూతి కలిగింది. తరువాత కొంతసేపు శ్రీ బాబూజీ బోధచేసి వెళ్ళిపోయారు. తరువాత బందా తాతయ్య గారు శ్రీ బాబూజీ వారి బోధను విశదీకరిస్తూ సర్వాంతర్యామి యైన భగవానుని నిరంతరం, ఏ పని చేస్తున్నా సరే మరువకుండా జపించ వచ్చునని స్వామి సెలవిచ్చారు అని చెప్పారు.

తరువాత నాలుగైదు సంవత్సరాల వరకు శ్రీ బాబూజీ దర్శనం అవ్వలేదు. తరువాత ఒక రోజు ఇంటికి ఎవరో వచ్చారు, టీ తెమ్మని నాన్నగారు చెప్పారు. అప్పట్లో కట్టెలపొయ్యిలే. వెలిగిద్దామని పొయ్యిలోని కట్టెలు తీస్తుంటే వాటిలో ఉన్న తేలు కుట్టింది. చాలా బాధ కలిగించింది. అలాగే టీ పెట్టుకుని తీసుకువెళ్ళాను. నాన్న గారు చూసి ఏమైందని అడిగారు. తేలు కుట్టిందని చెప్పాను. అప్పటికే చెయ్యి బాగా వాచింది. నాన్నగారు మంత్రం వేసి, మందు రాసారు కాని తగ్గలేదు. చెయ్యి నల్లగా అయిపోయింది. మరికొంత సేపటికి డాక్టరు వెంకట్రాజుగారు వచ్చి చూశారు. సైకిల్ డైనమో కరెంటు పెట్టారు, అయినా తగ్గలేదు. ఆరుబయట మంచం వేసి దానిపైన పడుకోబెట్టారు. డాక్టరు రాజుగారు నాతల దగ్గరే కుర్చీ వేసుకుని కూర్చుని గురుదేవులను ధ్యానించటం మొదలు పెట్టారు.

అప్పుడు శ్రీ బాబూజీ తునిలో ఉన్నారు. ఎప్పుడు, ఎలా బయలుదేరారో తెలియదు. దేవళ్ళ గారిని, ఆనందు గారిని, సీతయ్య గారిని తీసుకుని కారులో వచ్చారు. రోడ్డు బాగాలేదని నిడమర్రులో దిగి నడిచి వచ్చారు. శ్రీ బాబూజీ ఒక్కరే ముందు వచ్చారు. నేను పడుకున్న మంచానికి పది గజాల దూరం నుంచే నా ముఖం మీద బ్యాటరీ లైటు వేసి, గేటు తలుపు తీయండి అన్నారు. అక్కడే కూర్చున్న నాన్నగారు, డాక్టరుగారు వెంటనే వెళ్ళి తలుపు తీసి, స్వామిని తీసుకు వచ్చి కాళ్ళు కడుగుకోవటానికి నీళ్ళు యిచ్చారు.

స్వామికి కుర్చీ వేసి, నా పరిస్థితి చెప్పారు. శ్రీ బాబూజీ నా చెయ్యి నిమిరి, లేవదీసి కూర్చోపెట్టి, నాకు ఆకలిగా ఉంది ఏదో పెడతాను అన్నావు పెట్టు అన్నారు. నాకు అంతా అయోమయంగా ఉంది.

అప్పుడు డాక్టరు రాజు గారు నాకు ఒక గ్లాసు మంచి నీరు పట్టించి, బాబూజీ వచ్చారు ఏదైనా పెట్టు అన్నారు. అప్పుడు నాకు పూర్తి స్పృహ వచ్చింది. లేచి వెళ్ళి పంచదార విసిరి మినప సున్నుండలు, సేమ్యా ఉప్మా చేసి తీసుకు వచ్చే సరికి బాబూజీతో వచ్చిన మిగిలిన వారు చేరుకున్నారు. 'అయ్యో! నేను తయారు చేసింది అందరికీ సరిపోదేమో' అనుకున్నాను. శ్రీ బాబూజీ ఒక స్పూనుతో కొద్దిగా తీసుకుని, మిగిలినది అందరికీ పెట్టమన్నారు. నాన్నగారు మిగిలిన అందరికీ పెట్టారు. శ్రీ గురుదేవుల దయవలన లోటు లేకుండా అందరికీ సరిపోయింది. నా చేతి వాపు, బాధ ఎప్పుడు మాయమైపోయాయో తెలియలేదు.

కొంతకాలం తరువాత శ్రీ గురుదేవులు ప్రతినెల శుద్ధ ఏకాదశికి నిండ్రకొలను వచ్చి మాయింటి ఆవరణలో సత్సంగం జరిపేవారు. వారి ఉపన్యాసం ఎంతో గంభీరంగా ఉండేది. ఊరిలోని భక్తులు మునగాల రామన్న గారు, శేషయ్య గారు, బండారు వీర్రాజు గారు, అచ్యుత చంద్రయ్య గారు, నిడమర్రు మునసబు గారు, ఇంకా ఎంతో మంది భక్తులు స్వామి దర్శనం కొరకు వచ్చేవారు. మా యింటి ఆవరణ అంతా నిండిపోయేది. ఒక్కొక్కసారి నేను రావటం లేదు, సత్సంగం యథావిధిగా జరపండి అని కబురు చేసేవారు.

అటువంటి సందర్భాలలో శ్రీ బందా తాతయ్య గారు ఉపన్యాసం చెప్తుండేవారు. శ్రీ బాబు మధ్యలో వచ్చి కనుపించకుండా వెనుక నిలబడి వింటుండేవారు. ఒక్కొక్క సారి నిండ్రకొలను సత్సంగంలో చెప్పిన విషయం, అదే సమయంలో గుండుగొలను బాలమ్మ గారి యింట్లోనో, భీమవరం శ్రీరామ్మూర్తి తాతయ్య గారి యింట్లోనో చెప్తుండేవారు. స్వామి ఆహారం తీసుకుంటూ "ఇందిర ఇంకా ఏమీ తినలేదు" అనుకునేవారు. నాకు వివాహం అయిన తరువాత "మీరిద్దరూ ఏమి మాట్లాడుకున్నారో చెప్పనా" అని ఆట పట్టించేవారు.

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

## శ్రీ గండికోట వేంకటేశ్వర్లు గారితో శ్రీబాబు

(గత సంచిక తరువాయి) - కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

అక్కడ తుపాకీరాజు గారు శ్రీ బాబు యెడల చూపిన భక్తి ప్రపత్తులు, భక్తులందరితో కూడ అత్యంత వినయ వినమ్రతలతో మెలిగిన తీరు వెంకటేశ్వర్లు గారిని ముగ్ధులను చేసింది. ఇదివరకు తుపాకీరాజు గారని పిలిచేరేమోగాని యిప్పుడాయన 'ధర్మరాజు' అనుకున్నారు.



సమారాధన అనంతరం జరిగిన సమావేశంలో శ్రీ బాబు "మానవులకు, మానవులకు మధ్య ఈర్ష్య, అసూయ, ద్వేషము, అసహనము, భేద బుద్ధి నశించి, సర్వ జీవరాసుల యెడల సమభావమును, ప్రేమ దృష్టిని కలిగి ఉండటమే నిజమైన సోషలిజం. అటువంటి సోషలిజమును మన హిందూ ధర్మము ప్రబోధిస్తున్నది. మన పవిత్ర మాతృ భూమిలో మాత్రమే అటువంటి సోషలిజం ఆచరణలో ఉన్నది. త్యాగం చేతనే మానవుడు అమృతత్వాన్ని పొందగలడని, ప్రతి ఫలాన్ని కోరని ప్రేమను అందరికి అందించమని, అపకారికి కూడా ఉపకారం చేయమని బోధించే ఏకైక ధర్మం ప్రపంచంలో మన హిందూ ధర్మమొక్కటే" అని ప్రబోధించారు.

ఆ సమావేశము ముగిసిన వెంటనే వెంకటేశ్వర్లుగారు, శ్రీ బాబుకు ప్రథమంగా నమస్కరిస్తూ, ఈ అధ్యాయం ప్రారంభంలో వ్రాసిన విధంగా మాట్లాడారు. శ్రీ బాబు "మీరే స్వయంగా చూశారుగా తుపాకీ రాజుగారిని? ఒకప్పుడు వారి దగ్గర ఒక అడుగు ఎక్కువ ముందుకు వేసినా, ఒక మాట ఎక్కువగా మాట్లాడినా తుపాకీ పైకి లేచేది. వారి హస్తములు యీనాడు తుపాకిని విడిచి వందన పూర్వకంగా కలుసుకుంటున్నాయి. ఆ వందనంలో, ఎడమ చేయి

జీవాత్మను, కుడి చేయి పరమాత్మను సూచిస్తున్నాయి. చేతులు జోడించినపుడు జీవాత్మ పరమాత్మతో ఐక్యతను పొందుతుంది. అదే బ్రహ్మానందము. అదే ఆత్మానందము. అలాగే తోటి మానవుడు ఎదురైనపుడు రెండు చేతులూ జోడించి వందనం చేస్తే 'యీ రెండు చేతులూ కలిసినట్లు మన మనస్సులు ఏకమై మన మిద్దరము బ్రహ్మానందమును అనుభవించెదము గాక' అని భగవంతుని ప్రార్థించినట్లు అవుతుంది. ఆ భావంతో నీవు చేతులు జోడిస్తే, అవతలి వ్యక్తి ద్వేష భావంతో వచ్చిన వాడైనా సరే, తన భావమును దిద్దుకొని, తానూ చేతులు జోడిస్తాడు. ఇక ఎనలేని ఆనందమే వారి సొమ్మవుతుంది. తమరు ఆదర్శంగా పెట్టుకున్న సోషలిజం యిదేనంటారా? కాదంటారా?'' అన్నారు. 'ఔ'నన్నారు వెంకటేశ్వర్లుగారు.

వెంకటేశ్వర్లుగారి హృదయం ఆ క్షణం నుంచి శ్రీ బాబు దివ్య చరణారవిందములకు అంకితమైపోయింది. అప్పటికే వెంకటేశ్వర్లుగారు 32 రోజులు సెలవులో ఉన్నారు. అందుకని వారు శ్రీ బాబునుసెలవడుగుతూ "బాబూ! నా జీవితంలో ఎన్నడూ యింత సెలవు పెట్ట లేదు. తమరు యింత ఆత్మీయతతో నన్ను యిన్నాళ్ళూ ఎందుకు ఉండమన్నారో, నేను ఎందుకు ఉన్నానో, ఎలా ఉండగలిగానో నాకే ఆశ్చర్యంగా ఉంది. ఆనందంగానూ ఉంది. కాని సెలవు యింకా పొడిగించి ఉండటం ధర్మం కాదు. సెలవిప్పించండి'' అన్నారు. శ్రీ బాబు యింకొక్క రెండు రోజులు ఉండండి'' అన్నారు. వెంకటేశ్వర్లుగారు కుదరదన్నారు. శ్రీ బాబు "నేను మీ మంచికే చెబుతున్నాను. ఇప్పుడు మీరు వెళ్ళిపోయినా, మళ్ళీ వెంటనే మీ అంతట మీరే తిరిగి రావలసివస్తుందోమో'' అన్నారు. వెంకటేశ్వర్లుగారు దృఢంగా "మళ్ళా రావలసివస్తే వస్తానుగాని, యిప్పుడు వెళ్ళక తప్పదు'' అన్నారు. "సరే మీ యిష్టం'' అన్నారు శ్రీ బాబు. వెంకటేశ్వర్లుగారు మద్రాసు వెళ్ళి, బాబు అన్నట్లుగానే , మళ్ళీ మూడో రోజుకు తిరిగి భీమవరం వచ్చారు.

- సశేషం


విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

(గత సంచిక తరువాయి)

## భక్త పోతన

"నేను పూనుకొన్నది భాగవతాన్ని రచించటానికి. శ్రీరామచంద్రుడే నాచే వ్రాయించుచున్నాడు. దీనిని రచిస్తే భవ బంధాలు తొలగి పోవునట అందువలన ఈ రచనకు శ్రీకారము చుట్టెదను" అని చెప్పాడు.



భాగవతమునందలి స్కంధాలు అత్యంత లాలిత్య శోభితాలు. ఇది కృష్ణ లీలామయం. ఇది శుకయోగి మధుర వచనాలతో మనోజ్ఞమైనది. ఇందలి గాధలన్నీ మనోహరములు, సందేశాత్మకములు. దీనిని చదువుట వలన కలిగెడి ఫలము మోక్షము.

ఈ సహజ పండితుడు ఈ గ్రంథము అంతటా భక్తికే పెద్దపీట వేశాడు. ఆయన శృంగార, వీర, కరుణాది వివిధ రసాలను సముజ్వలంగా పోషించాడు. యశోదాది మాతృ భావములను, నందాదుల పితృ భావములను, నరకాసురుని వధించే సమయంలో సత్యభామతో వీర శృంగారములను, రుక్మిణిలో ధైర్యసాహసములను, ప్రహ్లాదాది పరమ భక్తులలో అచంచలమైన భక్తిని, కుచేలాదులలో నిష్కామయోగమును, ఋషుల అంశలతో జన్మించిన గోపికలలో మధుర భక్తిని, కంసాది దుష్టుల ఆటలు కట్టించుటలో శ్రీకృష్ణ లీలా వైభవములను, యశోదమ్మకు బాలకృష్ణుని ముఖంలో బ్రహ్మాండాలను ప్రదర్శించుటలో అద్భుత స్థితిని, లోక కళ్యాణార్థమై ప్రవర్తిల్లిన దశావతార వైభవాలను, వెల్లి విరియ చేయుటలో ఈ మహాకవి చూపిన తీరు, వాటిని మనోరంజకంగా పోషించిన విధానము అమోఘం. ఈ ఘట్టములను చదివేవారి హృదయాలను రసానందములో ముంచివేస్తుంది.

- సశేషం

# శ్రద్ధాంజలులు

శ్రీబాబూజీ భక్తులు, పావులూరి శ్రీరామం (పిడపర్తి రామిరెడ్డి) గారు 30-10-2025 గురువారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 93 సంవత్సరాలు. వీరు కాళీవనాశ్రమం నంబూరులోని ఆశ్రితాశ్రయంలో గత కొద్ది కాలం నుండి ఉంటున్నారు సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

---

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, పాందువ నివాసులు అయిన కునాధరాజు గోపాలరాజు గారు 30-10-2025 గురువారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 87 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

---

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, భీమవరం కాళీవనాశ్రమ శాఖలో గత కొద్ది కాలం నుండి సేవలు అందిస్తున్న ముదునూరి కాళీప్రసాదరాజు (గరగపర్రు ప్రసాద్) గారు 31-10-2025 శుక్రవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 62 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

---

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ నివాసులు అయిన శ్రీమతి ఆకుల జయభారతిగారు గత కొద్ది కాలం నుండి ఆశ్రమ ఆశ్రితాశ్రయంలో ఉంటున్నారు. వీరు 5-11-25 బుధవారం కార్తికపూర్ణిమ నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 85 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

---

Printed & Published by Paluri Siva Rama Kaliprasad, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Nagendra Enterprises, 24-7-8, Sandeep Mansion, Jonnavittula Vari St.,Gandhi Nagar, Vijayawada-520003, N.T.R.Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD

## సెప్టెంబరు 22 నుండి అక్టోబరు 4 వరకు శ్రీ కాళీవనాశ్రమునందు జరిగిన శ్రీ దేవీనవరాత్రి ఉత్సవముల దృశ్యములు










REGD. NEWS MAGAZINE PERIODICAL
Posted on Fifth and Sixth of every month

RNI No. 37804/81
POSTAL REGD. No. : GTR/27/2024-26

## సెప్టెంబరు 22 నుండి అక్టోబరు 4 వరకు శ్రీ కాళీవనాశ్రమునందు జరిగిన శ్రీ దేవీనవరాత్రి ఉత్సవముల దృశ్యములు







If undelivered please return to
SAMARDHA SADGURU
Sri Kali Gardens Ashramam - 522 508, A.P.